


ముదినేపల్లి మండలం కొత్తపల్లి వద్ద..



పెదవేగి శివాలయంలో ఉసిరి చెట్టు వద్ద 365 వత్తులు వెలిగిస్తున్న భక్తులు

పోలి స్వర్గ దీపారాధనలు

పోయి రావమ్మా పోలి స్వర్గానికి.. అంటూ మహిళలు జిల్లావ్యాప్తంగా సోమవారం వేకువ జామున పోలిస్వర్గ దీపారాధనలు నిర్వహించారు. అరటి డొప్పల్లో దూది వత్తులు వెలిగించి కాల్వల్లో వదిలి కార్తీక మాస దీక్షలకు ముగింపు పలికారు. గృహాల్లోను తులసీ మొక్కల వద్ద దీపారాధనలు చేశారు.

టీడీపీలోకి ఆళ్ల నాని

- నేడు అధినాయకత్వం కీలక నిర్ణయం
- అదే దారిలో మరో ఇద్దరు మాజీలు
- భారీ మెజార్టీతో గెలుపొందినా మళ్లీ వారెందుకంటున్న కేడర్
- వైసీపీ మూలాలు కదిలించేందుకే ఈ నిర్ణయమంటున్న టీడీపీ నేతలు

7



పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహణపై సమీక్ష

ఏలూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని పండుగ వాతావరణంలో జరపాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాణి పాల్గొన్నారు.

బాలల ఆరోగ్య భద్రతకు స్క్రీనింగ్ క్యాంపులు

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలల ఆరోగ్య పరీక్షలను సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమ (ఆర్‌బీఎస్‌కే) విభాగం జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పథకమైన ఆర్‌బీఎస్‌కేలో స్క్రీనింగ్ క్యాంపుల ద్వారా 6 నెలల వయస్సు నుంచి 18 ఏళ్ల వారికి ఆరోగ్యపరీక్షలు చేస్తారన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లోని 1,11,066 మంది చిన్నారులకు, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే 1,57,845 మందికి స్కూలులోనే ప్రాథమిక వైద్య పరీక్షలు జరిపి తదుపరి వైద్య చికిత్సల కోసం జాబితాలను సిద్ధం చేస్తామన్నారు. ఈ స్క్రీనింగ్ టెస్టులు దశల వారీగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు జరుగుతాయన్నారు. ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నేతృత్వంలో పరీక్షలు చేస్తారన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆస్పత్రులతో పాటు, తిరుపతి, విజయవాడ, విశాఖలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్త తంత్రాలు!

జిల్లాల పునర్విభజనలో జనం మాట వినని జగన్ ప్రభుత్వం



ఉన్న నాలుకకు మందేస్తే.. అన్న చందంగా జిల్లాల పునర్విభజన, ఆ తర్వాత వచ్చిన పరిణామాలు ఇప్పుడు అందరికీ కొత్త అనుభవాలు మిగులుస్తున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగి చాలాకాలం కావొస్తోంది. అప్పట్లో భవిష్యత్తులో ఎదురయ్యే ఆటంకాలపైన జనంతో పాటు స్థానిక ప్రతినిధులు గొంతెత్తారు. కేవలం పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక కేంద్రంగా మార్చాలనే కోణంలోనే తప్ప ఎదురయ్యే మంచి, చెడులను ఆనాడు అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గడిచిన రెండేళ్లుగా జనం పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు సరికొత్తగా అందరూ సమస్యలను ఏకరువు పెడుతున్నారు.

- ఇప్పటికీ వెంటాడుతున్న అనేక సమస్యలు
- ఏలూరు కాదు విజయవాడ కావాలంటున్న జనం
- రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లోను ఇదే సంక్లిష్టత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాల విభజనతో ఉమ్మడి జిల్లాల తీరుతెన్నులు ఒక్కసారిగా మారాయి. ఆ స్థానంలో అనేక ఇబ్బందులు, మరెన్నో సమస్యలు చోటు చేసుకున్నాయి. జిల్లాల విభజన పూర్తయ్యి చాలా కాలమైనా సమస్యలు అలానే ఉన్నాయి. జనం చేసిన డిమాండ్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లాల విభజనలో ఏలూరు పార్లమెంటు స్థానాన్ని ఏలూరు జిల్లాగా ప్రకటించిన నాటికి ఒక్కసారిగా మార్పు, చేర్పు అనివార్యమైంది. ఉమ్మడి కృష్ణాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలు ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చాయి. ఏలూరులో తాము విలీనం కావడానికి సిద్ధంగా లేమని, తమను కృష్ణా జిల్లాలోనే కొనసాగించాల్సిందిగా అప్పట్లో నూజివీడు నియోజకవర్గవాసులు గళం విప్పి సంతకాల ఉద్యమానికి దిగారు. ప్రభుత్వ విధానం కాబట్టి అప్పట్లో నూజివీడు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న మేకా ప్రతాప అప్పారావు నోరు మెదపలేకపోయారు. నియోజకవర్గమంతటా ఈ విషయంలో తమకు ఎదురవుతున్న వ్యతిరేకతను వైసీపీ నేతలు ఆనాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు. నూజివీడు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉండగా ఇది కాస్తా జిల్లాల విభజన అనంతరం విస్తీర్ణంలో పూర్తిగా సగానికి సగం తగ్గింది. విభజన కాకమునుపు నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో 14 మండలాలు ఉండగా ఆ తర్వాత ఇప్పుడది కేవలం ఆరు మండలాలకే పరిమితమైంది. ఆగిరిపల్లి మండలం నుంచి జిల్లా కేంద్రం ఏలూరు చేరుకోవాలంటే 70 కిలోమీటర్లు ప్రయాణించాలి. నూజివీడును విజయవాడకే పరిమితం చేయాలని, ఆది నుంచి విజయవాడతో తమకున్న సత్సంబంధాలు, సాన్నిహిత్యాన్ని విడదీయవద్దంటూ విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఇదే తరుణంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార నిమిత్తం వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. నూజివీడు, అడవి నెక్కలం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార సభల్లోను అప్పట్లో చంద్రబాబు స్థానికుల డిమాండ్‌కు సానుకూలంగా స్పందించారు. 'ఇక్కడివారంతా తమను కృష్ణా జిల్లాలోనే ఉంచాలని గట్టిగానే అడుగుతున్నారు. ఇక్కడివారంతా తమ వ్యవహారాలన్నీ విజయవాడతోనే ముడిపడి ఉన్నాయంటూ చెప్పుకొస్తున్నారు. మేము అధికారంలోకి వస్తే తప్పనిసరిగా మీ కల నెరవేరుస్తాం' మంటూ నూజి వీడు ఎన్నికల సభలో ఆనాడు చంద్రబాబు స్పష్టతతో కూడిన హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ఆయనపైనే నూజివీడు వాసులంతా ఆశలు పెంచుకున్నారు.

డివిజన్ కాస్తా చిక్కింది ..

జిల్లాల విభజనతో నూజివీడు రెవెన్యూ డివిజన్ పూర్తిగా చిక్కింది. దీనిని సర్దుబాటు చేసేందుకు ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా అప్పటి జగన్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది. నూజివీడు రెవెన్యూ డివిజన్‌ను ఎత్తేయాల్సిన పరిస్థితి నుంచి కాస్తోకూస్తో గట్టెక్కించేలా ఈ డివిజన్ పరిధిలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలతోపాటు చింతలపూడి నియోజకవర్గంలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను విలీనం చేశారు. కాని ఏలూరు డివిజన్‌కు అత్యంత చేరువలో ఉన్న చింతలపూడి, లింగపాలెంలను అటువైపు మళ్లించడాన్ని అప్పట్లో స్థానికులంతా వ్యతిరేకించారు. కాని ప్రభుత్వం పట్టుసడలించకుండా అనుకున్నదే చేసి చూపించింది. ఇంకోవైపు కైకలూరు నియోజకవర్గ పరిధిలోని ముదినేపల్లి, కలిదిండి మండలాలు ఒకప్పుడు గుడివాడ రెవెన్యూ డివిజన్‌కు కూతవేటు దూరంలో ఉండేవి. ఇప్పుడవి కాస్తా జిల్లాల విభజన తర్వాత దూరంగా ఉన్న ఏలూరు డివిజన్‌లో కలిశాయి. నూజివీడుకు విజయవాడ ఎలాగో ఈ రెండు మండలాలకు గుడివాడ అలాంటిదే. చివరికి చేసేదిలేక అందరూ సైలెంట్ అయ్యారు. ఇప్పటికీ జిల్లా అధికారులు సుదూరంగా ఉన్న ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలను సందర్శించలేకపోతున్నారు. జిల్లా నిడివి పూర్తిగా తగ్గుముఖం పట్టినా కొన్ని శాఖాధికారులు ఆ వైపు తొంగి చూడలేకపోతున్నారు. కొత్తగా జిల్లాల విభజన అయిన తర్వాత తమకు వచ్చిన లాభం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తుంటే ఇప్పటికీ సమాధానం కరువే.



విముక్తి ఎప్పటికో..

ఒకవైపు అడ్డదిడ్డంగా జరిగిన జిల్లాల విభజనతో జనంతోపాటు అన్ని వర్గాలు విలవిలలాడాయి. కేవలం ఏదో సంస్కరణ చేసినట్టు బిల్డప్ ఇచ్చేలా అంత హడావుడి చేసినా ప్రజాప్రయోజనం పెద్దగా లభించలేదు. ఇలాంటి తరుణంలో కొత్తగా పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వంపైనే జనం ఆశలు పెంచుకున్నారు. తమ డిమాండ్‌లో కొంతలో కొంతైనా ఈ ప్రభుత్వం నెరవేర్చగలదనే ఆశతోనే ఉన్నారు. కాని సంక్లిష్టంగా మొత్తం ఆరు నియోజక వర్గాలకు గాను మూడింటిలో ఇలాంటి సమస్యలు తలెత్తడంతో పరిష్కారం అంత సులభమేమీ కాదన్నట్టుగానే కనిపిస్తోందన్న అభిప్రాయాలు లేకపోలేదు.

తుఫాన్ వీడినా.. తొలగని ముసురు



ముదినేపల్లి మండలం కాకరవాడలో నేలకొరిగిన కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు

- కొనసాగుతున్న మబ్బుల వాతావరణం
- జిల్లాలో 1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి
- పోలవరంలో 5.4 మి.మీ వర్షపాతం

ఏలూరుసిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను బెడద తీరినా జిల్లాలో సోమవారం కూడా మబ్బుల వాతావరణం కొనసాగింది. దీంతో అక్కడక్కడా మాత్రమే వరి కోతలు నిర్వహించారు. రైతులు తిరిగి ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం ఏ మాత్రం తడిచినా తేమశాతం పెరిగి మద్దతు ధర లభించే అవకాశాలు ఉండవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 45 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్‌బాషా తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు 97 వేల 523 ఎకరాల్లో వరి కోతలు పూర్తవ్వగా కోసిన వరి పంటకు సంబంధించి 2.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. 31 వేల 423 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. 12వేల 765 మెట్రిక్ టన్నుల ధాన్యం రహదారులపై ఆరబెట్టారు. 3,314 టన్నుల ధాన్యం ఓదెలలో నిల్వ ఉంచగా 10వేల 687 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కుప్పలు వేశారు. ప్రస్తుతం జిల్లాలో 2231 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉంది. 51వేల 603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు సొంత అవసరాలకు నిల్వ చేసుకున్నారు. జిల్లాలో గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా పోలవరం మండలంలో 5.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 1.3 మి.మీగా నమోదైంది. కొయ్యలగూడెంలో 4.6, చింతలపూడి 4.2 మండవల్లి 2.4, ముసునూరు 2.4, బుట్టాయిగూడెం 2.4, కైకలూరు 2 మి.మీ, మిగిలిన మండలాల్లో 2 మి.మీ కన్నా తక్కువగానే వర్ష పాతాలు నమోదయ్యాయి.

● ఆక్వా ఉక్కిరి బిక్కిరి..



మండవల్లి మండలం గన్నవరంలో ఒక చేపల చెరువులో మృతి చెందిన చేపలు

మండవల్లి : తుపాను ప్రభావంతో వాతావరణంలో సంభవించిన మార్పులు వల్ల చేపలు, రొయ్యలు ఆక్సిజన్ కొరత ఏర్పడి మృత్యువాత పడ్డాయి. మండలంలోని లక్షల రూపాయలు చేపలకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. గన్నవరంలో ఒక రైతుకు సంబంధించి చేపల చెరువులో కేజీన్నర పైబడి తెల్లచేపలు బొచ్చె, శీలావతులు నీటిపై తేలిపోయాయి. నీటిలో ఆక్సిజన్ అందక మృతి చెంది రైతుకు కన్నీరు మిగిల్చాయి. ఇలాంటి ఘటనలు మండలంలోని అనేకం ఉన్నాయి. అయితే ఆక్వా సాగులో పెట్టుబడులు, అప్పులతో కూడింది కావడంతో నష్టం జరిగినా అప్పు దొరకదని భయంతో రైతులు బహిరంగ చెప్పుకోలేకపోతున్నారు. ఏది ఏమైనా తుపాను ప్రభావంతో వర్షం ప్రభావం పెద్దగా లేకపోయినా నష్టం మాత్రం భారీగానే జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

ముదినేపల్లి మండలంలో నేలకొరిగిన పైరు

ముదినేపల్లి : ఫెంగల్ తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ మూడు రోజులుగా వీచిన గాలులకు ముదినేపల్లి, చినపాలపర్రు, కాకరవాడ, వడాలి, పెయ్యేరు, పెదపాలపర్రు, సింగరాయపాలెం, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లోని సుమారు 4 వేల ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేలకొరిగింది. సుమారు 2 వేల ఎకరాల్లో మరో 15 రోజుల్లో కోతకు రానున్న పసిరి పైరు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

చెర్వులో విష ప్రయోగం..?

- వణుదుర్రు పంచాయతీ చెరువులో చేపల మృత్యువాత
- రూ. ఆరు లక్షలు నష్టమంటూ లీజుదారుడి ఆవేదన



ముదినేపల్లి మండలం వణుదుర్రు పంచాయతీ చెరువులో చనిపోయి తేలిన చేపలు

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వణుదుర్రు పంచాయతీకి చెందిన ఏడెకరాల చేపల చెరువులోని చేపల మృత్యువాత పడ్డాయి. సోమవారం ఉదయం చెరువులోని చేపలు టన్నుల కొద్ది చనిపోయి నీటిపై తేలియాడుతూ కన్పించాయి. ఆ చెరువును లీజుకు తీసుకున్న అదే గ్రామానికి చెందిన కట్టా సుబ్రహ్మణ్యం చెరువులోని అడుగు భాగాన్ని పరిశీలించగా, మరిన్ని చేపలు చనిపోయి కన్పించాయి. వాతావరణంలో మార్పుల వల్ల చేపలు చనిపోయాయా..? లేక చెరువులో విష ప్రయోగం జరిగిందా? అన్న అనుమానాన్ని లీజుదారుడు వ్యక్తం చేస్తున్నాడు. చెరువులో సుమారు ఎనిమిది టన్నుల వరకు చేపలు చనిపోగా రూ.6 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. చెరువులోని నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి, వణుదుర్రు సచివాలయ మహిళా పోలీసుకు ఫిర్యాదు అందజేశాడు.



ఫిర్యాదులు అందుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రతి అర్జీని ఆడిటింగ్ చేస్తాం : కలెక్టర్

ఏలూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, ఆర్డీవో అచ్యుత అంబ రీష్ తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రతి అర్జీని ఆడిటింగ్ చేస్తాం. అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తా'మన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ, ముంబై, కోలకత్తా, చెన్నైల నుంచి సీబీఐ, ఈడీ అధికారులమని చెప్పి ఫోన్లు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఇలాంటి ఫోన్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏఎస్పీ సూర్యచంద్ర రావుతో కలసి ఫిర్యాదులను స్వీకరించారు.



పొదుపు సొమ్ము మాయం

- బ్రాంచి పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేసి ఏడాదైనా తిరిగి రాని సొమ్ము
- వేగివాడ తపాలా కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన



తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

పెదవేగి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రూపాయి, రూపాయి పోగుచేసి పోస్టాఫీసులో పొదుపు చేస్తే, ఆ సొమ్మును అదే బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఖాతాదారులను బురిడీ కొట్టించి ఖాతాలో జమ చేయకుండా దిగమింగేశాడు. ఈ విషయం తెలిసి ఖాతాదారులు తమ సొమ్ము ఇప్పించాలని డిమాండ్ చేయగా విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడిన అధికారులు సంబంధిత బ్రాంచ్ పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేసి, మీ సొమ్మును తిరిగి చెల్లిస్తామని ఖాతాదారులకు హామీ ఇచ్చారు. ఇది జరిగి సరిగ్గా ఏడాదైంది. సొమ్ము ఇప్పుడొస్తుంది. అప్పుడొస్తుందీ అంటూ ఎదురుచూసిన ఖాతాదారులు ఏడాదిగా తమ సొమ్ము చేతికందక పోవడంతో సోమవారం ఉదయం తపాలా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ సొమ్ముకు సమాధానం చెప్పేవరకు పోస్టాఫీసును తెరవనీయబోమని బాధితులు భీష్మించారు.

పెదవేగి మండలం వేగివాడలోని పోస్టాఫీసు బ్రాంచి కార్యాలయంలో ఐదేళ్ల కిందట నాగరాజు అనేవ్యక్తి బ్రాంచి పోస్టుమాస్టర్‌గా ఉండేవారు. ఆ సమయంలో గ్రామంలో పొదుపు ద్వారా కలిగే లాభాలపై అవగాహన కల్పించడంతో చాలామంది పొదుపు ఖాతాలు తెరిచి, నెలనెలా పొదుపు చేస్తూ వచ్చారు. వీరిలో రోజువారీ కూలీలు, సామాజిక పింఛన్లు తీసుకునేవారే ఎక్కువగా పొదుపు చేశారు. నాగరాజు లబ్ధిదారుల ఖాతా పుస్తకాలను తన దగ్గరే పెట్టుకుని, నెలనెలా లబ్ధిదారులు కట్టే పొదుపు సొమ్మును జమ చేస్తున్నట్టు చూపిస్తూ ఒక రసీదు ఇచ్చేవారని బాధితులు సత్యవరపు సుబ్బారావు, లింగంపల్లి రాంబాబు, చిట్టూరి బాబూరావు, కాలి యోహాను, సింగవరపు రత్నకుమారి, చొక్కా నర్సమ్మ తదితరులు తెలిపారు. అయితే ఆ సొమ్మును ఖాతాలో జమ చేయకుండా చెల్లని రసీదులు ఇచ్చారని, ఇలా దాదాపు రూ.అరకోటి పైనే స్వాహా చేసినట్టు ఆరోపిస్తున్నారు. ఏడాది కిందట విషయం తెలిసి నిలదీయగా తపాలా కార్యాలయం జిల్లా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ జరిపి నాగరాజును గతేడాది నవంబరులో సస్పెండ్ చేశారు. కాగా తమ సొమ్ము వస్తుందని ఏడాదిగా ఎదురు చూసిన బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. బాధితులు పోస్టాఫీసును తెరవనీయకపోవడంతో పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణతో పాటు ఘటనా స్థలానికి చేరుకున్న పోస్టల్‌శాఖ ఇనస్పెక్టర్ శ్రీకాంత్.. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. దీనిపై ప్రస్తుత బ్రాంచి పోస్టు మాస్టర్ రమ్యను వివరణ కోరగా దీనిపై అధికారులు విచారణ జరుపుతున్నారన్నారు.

మోక్ష ప్రదాయకం..మార్గశిర మాసం



కామవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసం ప్రారంభమైందని వేద పండి తులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు (దుర్గబాబు) తెలిపారు. హిందువులకు ఈనెలంతా ఎంతో పవిత్రమైనదని అన్నారు. మోక్షగ్రంధమైన భగవద్గీత అవతరించింది కూడా ఈ మాసంలోనే. తిరుప్పావై చదువుతూ పరమ భక్తితో చేసుకునే ధనుర్మాసవ్రతం కూడా ఈ మాసంలోనే మొద లవుతుంది. ఏకాదశిలలో ఉత్తమమైనది మోక్షద ఏకాదశి అని భక్తితో ఉపవాసం, జాగరణ చేసే మోక్షద ఏకాదశి ప్రతీ ఏడాది మార్గశిర మాసంలోని శుక్లపక్ష ఏకాదశిగా జరుపుకుంటామన్నారు. మార్గశిర మాసం తరువాత అంటే పుష్యమాసం నుంచి ఉత్తరాయణం మొదలవుతుంది. మార్గశిర మాసంలో గురు, శనివారాలు చాలా ప్రాధాన్య మైనవి. విష్ణువును పూజిస్తారు. సూర్యశక్తి, అగ్నితేజం మన స్సును, బుద్ధిని ప్రచోదనం చేస్తాయి అందుకే ధనుర్మాసం మొదటి రోజు తెల్లవారు జామున నిద్రలేచి స్నానం చేయడం నియమంగా ఉందన్నారు. మార్గశిరమాసంలోని మొదటి రోజు పాడ్యమి నదిలో స్నానం చేసి దీపాలు వదిలి విడిచిపెట్టడమే కాదు పోలికథ చదువుకోవడం శుభప్రద మన్నారు. మార్గశిర మాసంలోనే అనేక పుణ్య తిథులు ఉన్నాయని, 7వ తేదీన సుబ్రహ్మణ్య షష్ఠి, 8న కాల భైరవాష్టమని, 11న మోక్షద ఏకాదశి, గీతా జయంతి, 13న హనుమత్‌వ్రతం, 15న మార్గ శిర పౌర్ణమి, దత్త జయంతి, 16న ధనుర్మాసం ప్రారంభమవుతుందని తెలిపారు. 18న సంకటహర చతుర్థి, 26న సఫల ఏకాదశి, 28న శనిత్రయోదశి, 29న మాస శివరాత్రి, 30న మార్గశిర అమా వాస్యతో మార్గశిర మాసం ముగుస్తుంద న్నారు. ఈ మార్గశిర మాసంలో విష్ణు ఆరాధన చేయడం, పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకు మార్చనలు నిర్వహించి ఉపవాస దీక్షలు కూడా నిర్వహిస్తే సత్ఫలితాలు ఇస్తాయని పండితులు దుర్గబాబు తెలిపారు.



పాడ్యమి దీపాలు వదులుతున్న భక్తులు



వేద పండితులు దుర్గబాబు

వేప చెట్టు నుంచి పాలు !



మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో వేపచెట్టుకు పాలు కారడంతో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. గ్రామంలో పులపర్తి సత్యనారాయణ తోటలోని వేపచెట్టుకు సోమవారం ఉదయం నుంచి పాలు ధారగా కారుతున్నాయి. ఈ విషయం గమనించిన స్థానికులు , గ్రామస్థులు వేపచెట్టుకు పూజలు చేశారు. పరిసర గ్రామస్థులకు తెలియడంతో పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి పూజలు చేశారు. అక్కడికి వచ్చిన ఒక మహిళకు అమ్మవారు కన్పించి కుంకుళ్ళమ్మ అమ్మవారిగా చెప్పడంతో వేపచెట్టుకు ఎర్రటి దుస్తులు కట్టి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేయడం ప్రారంభించారు.

-మొగల్తూరు

ఆకివీడులో సాయి లీలలు

విగ్రహం నుంచి పాలు, నీళ్లు,తేనె, గంధం...



ఆకివీడులో ఉపాధ్యాయుడి నివాసంలోని సాయిబాబా విత్తడి విగ్రహం లీలలు గురించి గ్రామంలో ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నారు . ఆనాల చెరువు సమీపంలో ఉంటున్న వడలి వెంకటేశ్వర్లు నివాసంలో ఉపాధ్యాయుడు పురుషోత్తం, అతని తోడళ్లుడు అద్దెకు ఉంటున్నారు. గతేడాది మేలో పురుషోత్తం, తోడళ్లుడు కుటుంబాలు కలిసి షిరిడీ వెళ్ళారు. అక్కడ ఇత్తడి సాయిబాబా విగ్రహం కొనుగోలు చేశారు. ఆ విగ్రహనికి రోజూ పూజలు చేస్తున్నారు. నవంబరు 30న రాత్రి విగ్రహం నుంచి పాలు, నీళ్లు, గంధం, పంచదార, నెయ్యి, విభూది, కుంకుమ వచ్చాయని తెలిపారు. డిసెంబరు 1న ఉదయం తేనె వచ్చిందని, సోమవారం ఉదయం నీళ్లు, పెరుగు, గంధం వచ్చాయని చెప్పారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు వింతగా చూస్తున్నారు. కొంత సమయం తర్వాత నీళ్ళతో కడిగేస్తున్నట్లు అవుతుందని తెలుపుతున్నారు.

-ఆకివీడు



ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావును అభినందిస్తున్న ఎస్పీ కిశోర్

టెన్నిస్‌లో రన్నర్‌గా నిలిచిన డీఎస్పీకి అభినందనలు

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వ ర్యంలో 25వ ఆలిండియా ల్యాండ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ 2024 పోటీలను బెంగుళూరులో నవంబర్ 25 నుంచి 30 వరకూ నిర్వహించారు. ఈ పోటీలలో ఏలూరు జిల్లా ఎఆర్ డీఎస్పీ విజి శ్రీహరిరావు ఓపెన్ డబుల్స్‌లో పాల్గొని రన్న రప్‌గా నిలిచారు. దీంతో ఆయనను జిల్లా ఎస్పీ కిషోర్ ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. జిల్లా అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్ పాల్గొన్నారు.

క్రీడాభారతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాదికార సంస్థ ఆదేశాల మేరకు చైతన్య కస్యప్ ఫౌండేషన్ ఈనెల 8న క్రీడాభారతి అవార్డులను అందించేందుకు ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహణలో భాగంగా 12 ఏళ్ళు పైబడిన క్రీడాకారులు, విద్యా ర్థులు, పౌరుల నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీని వాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్న విద్యార్థులు, క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 8న ఆన్ లైన్ పరీక్ష ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో 25 నిమిషాలు జరుగు తుందన్నారు. 50 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. క్రీడా పరీక్షల్లో మొదటి అవార్డు కింద ఒకరికి లక్ష రూపా యలు, రెండో అవార్డు కింద ఇద్దరికి రూ.50 వేలు, మూడో అవార్డు ఆరుగురికి రూ.25 వేలు, 4వ అవార్డు 11 మందికి రూ.11 వేలు చొప్పున అందచేయ నున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రియకు గోల్డ్‌మెడల్



ఉండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన ఇంటర్ నేషనల్ కరాటే పోటీలలో ఉండి మండలం ఉణుదుర్రుకు చెందిన పదవ తరగతి విద్యార్థిని దండే ప్రియ గోల్డ్‌మెడల్ సాధించింది. నవంబరు 27 నుంచి డిసెంబరు 2 వరకు మలేషియాలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నారని ఈ పోటీ లకు ప్రియ సిద్ధమైంది. ప్రియ భీమ వరంలోని ఇమ్మానియేలు చిల్డ్రన్‌హోం హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి చదువుతుంది. మలేషియాలో డిసెంబరు 1న జరిగిన బాలికల కరాటే పోటీలలో తన సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించిందని కుటు ంబ సభ్యులు తెలిపారు. చిల్డ్రన్ హోంకు చెందిన బంధన పూర్ణ చంద్రరావు, కరాటే శిక్షణ ఇచ్చిన విజయభాస్కర్ తదితరులు అభి నందనలు తెలిపారు.

దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు

ముసునూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పుర స్కరించుకుని రమణక్కపేట మెయిన్ స్కూల్ ఉన్న భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతుల బాలబాలికలకు సోమవారం ఆటలపోటీలను నిర్వహించారు. ఐఈఆర్పీ డి.వి.ఎం.వి లక్ష్మీ నారాయణరావు పర్యవేక్షణలో క్యారెమ్స్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మంగ ళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సంద ర్భంగా ముసునూరులో ర్యాలీ నిర్వహించి, విజేతలకు బహుమతులను అంద జేయ నున్నట్టు ఆయన తెలిపారు. ఐఈఆర్పీ జె.నాగ మల్లేశ్వరీ పాల్గొన్నారు.



రమణక్కపేటలో దివ్యాంగ పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణరావు



వైకల్యాన్ని ఓడిద్దాం..!



ప్రతి మనిషికి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు ఉంటాయి... విధి లిఖితమో.. దైవశాసనమో కొంతమంది దివ్యాంగులుగా పుడుతుంటారు. ప్రమాదాల భారిన పడడం లేదా ఇతర కారణాల వలన కొంతమంది అంగవైకల్యం పొందుతుంటారు. అయితే వైకల్యాన్ని అధిగమించి పలు రంగాల్లో తమ ప్రతిభను చూపుతుంటారు. ఎంతో మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలుస్తూ వారికి మార్గదర్శకంగా ఉంటారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

పోలవరం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) సమాజంలో దివ్యాంగుల అభివృద్ధి, వారి హక్కులు, శ్రేయస్సును ప్రోత్సహించడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక సాంస్కృతిక జీవితంలో వారి పరిస్థితిపై అవగాహన పెంచడానికి డిసెంబరు 3న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ దివ్యాంగుల హక్కుల ప్రాముఖ్యతను బలపరచడానికి, సమాన హక్కులు పొందడానికి జెనీవాలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గ్లోబల్ రిపోర్టును

విధిని ఎదిరించి పోరాడారు
వివిధ రంగాల్లో సత్తా చాటారు
నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ప్రారంభిం చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం జాతి, మత, కుల లింగ ప్రాంత వివక్షలను నిషేదిం చినప్పటికీ వ్యక్తుల శారీరక వైకల్యం గురించి ప్రత్యేకించి ప్రస్తావించలేదు. అంగవైకల్య అంశా లను హక్కుల కోణంలో కాకుండా సంక్షేమం, సహాయం అందించే కోణంలో మాత్రమే పరిశీలిస్తున్నారు. విద్యా ఉద్యోగాలు సామాజిక రాజకీయ రంగాల్లో దివ్యాంగులకు ఎదురవు తున్న వివ క్షతను నివారించే లక్ష్యంతో 1992 సంవత్సరం డిసెంబరు 3 నుంచి అంతర్జాతీయ దివ్యాంగుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 79,873 మంది దివ్యాంగులు ఉండగా వారిలో 30 శాతం ప్రభుత్వం అందించే పెన్షన్లకు నోచుకోవడం లేదు. దీనికి కారణం వారికి అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలు లేకపోవడమే.. అర్హత ఉన్నా పెన్షన్లను పొందలేకపోతున్నారు. దీనికి తోడు కొంత మంది తప్పుడు మార్గాల్లో వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొంది ఉద్యోగ రిజర్వేషన్లు, పెన్షన్లు ఇతర దివ్యాంగ ఫలాలను అక్రమంగా అనుభవిస్తున్నారు. వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

దివ్యాంగుల చట్టం

దివ్యాంగుల చట్టం 1995 ప్రకారం ఏడు రకాల వైకల్యాలు ఉండేవి. 2016లో నూతన దివ్యాంగుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ చట్టంలో అదనంగా 14 రకాల వైకల్యాలను చేర్చింది. 2016 సెక్షన్ 37 ఎ,బి,సి ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని మంత్రిత్వ శాఖల నుంచి పేదరిక నిర్మూలన, అభివృద్ధి పథకాల్లో, వ్యవ సాయ భూమి, ఇల్లు కేటాయింపుల్లో ఐదు శాతం రిజర్వేషన్ మహిళా దివ్యాంగులకు అత్యధిక తగిన బడ్జెట్ కేటాయించాలని చట్టం చెబుతుంది. సెక్షన్ 67 ప్రకారం ఎటువంటి వేధింపులు, హింస, కించ పరచడం, దోపిడీ వంటి అమానుష క్రియలకు పాల్పడకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఈ చట్టం చెబుతుంది. చాలా మందికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు రిజర్వేషన్లు ఇతర విషయాలు తెలి యడం లేదు. ప్రభుత్వం అధికారులు వారికి వాటి పట్ల అవగాహన కల్పించాలి.

ప్రభుత్వాలు అందిస్తున్న సాయం

దివ్యాంగులకు పెన్షన్లు, కేటగిరీల వారీగా ఉద్యో గాలలో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయా ణానికి 50 శాతం రాయతీతో పాస్‌లు రుణాలలో సబ్సిడీలు, ట్రైసైకిళ్ళు, ట్రైమోటారు సైకిళ్ళు, ఉచిత పరికరాలు అందజేస్తున్నారు. సమాజంలో వారిని సామాజిక, ఆర్థిక, శారీరక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దివ్యాంగు లను వివాహం చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ వివాహాలు కాక పోవడం వల్ల వారికి కుటుంబ వ్యవస్థలు లేక ఒంటరిగా మిగులుతున్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు..



ఈమె పోలవరానికి చెందిన గంజి ఏసమ్మ.. పుట్టకతో మూగ చెవిటి.. తల్లిదండ్రులు చని పోయారు. తోబుట్టువులకు వివాహాలై వెళ్ళిపోయారు. 66 సంవత్సరాలైనా వివాహం కాలేదు. తల్లిదండ్రులు ఇచ్చిన ఇంటిని అద్దెకు ఇచ్చి పెన్షన్ సొమ్ములతో జీవితాన్ని గడుపుతోంది. తాను ఒంటరి కానని అందరూ తన వారేనని ఆత్మస్థైర్యంతో జీవితాన్ని గడుపుతోంది.



ఇతను అభిమళ్ళ హరేరామ్, పుట్టుకతోనే పోలియో ఉంది. చిన్న తనంలోనే తల్లి చని పోయింది. ఇద్దరు కవల పిల్లలు కాగా తమ్ముడు బాగానే ఉన్నాడు. కష్టపడి డిగ్రీ వరకూ చదివి కంప్యూటర్ శిక్షణ పొందిఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనిది ప్రేమ వివాహం.. ఇద్దరు సంతానం. వచ్చే జీతంతో ఉన్నంతలో సంతోషంగానే ఉంటున్నానని చెబుతున్నాడు..

క్రీడల్లో సత్తా

ఏలూరు రూరల్ : సర్వేంద్రియాలు ఉన్నా సంకల్పం లేకపోతే అనుకున్నది సాధించలేం. అదే సంకల్పం ఆయుధమైతే ఎంతటి వైకల్యమైనా చిన్నబోవాల్సిందే. పట్టుదల, ప్రతిభతో ఏలూరు జిల్లాకు చెందిన పలువురు దివ్యాంగులు.. తమకు ఎదురైన అవమానాలకు బదులు చెబుతూ తమికిష్టమైన క్రీడల్లో సత్తా చాటుతున్నారు. అవహేళన చేసిన వారినుంచే అభినందనలు అందుకుంటున్నారు.

ఎప్పుడూ బాధపడలేదు



ఈమె మానసిక దివ్యాంగురాలు. పేరు మోహనకుమారి తన లోపాన్ని చూసి ఏనాడు బాధపడలేదు. అనుకున్నది సాధించాలనే పట్టుదల ఆమెను ముందుకు తీసుకువెళుతున్నది. ఇటీవల ఏలూరు ఏ.ఎస్.ఆర్ స్టేడియంలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీల్లో పరుగుపందెం, డిస్క్‌త్రోలో ప్రథమస్థానం సాధించింది. ప్రస్తుతం దొండపాడు పరివర్తన్‌లో 5వ తరగతి చదువుతోంది. సంకల్పం ముందు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తోంది.

మంచి క్రీడాకారుడిని అవుతా



చూపులేకున్నా జీవితంలో ఎదగాలన్న సంకల్పం ముందు వైకల్యం ఓడింది. చదువుతో పాటు ఇష్టమైన క్రీడలో సాధన చేస్తూ పతకాలు సాధిస్తున్నాడు వెంకటేష్..ఇటీవల జరిగిన క్రీడాపోటీల్లో షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం సాధించాడు. అనేక పోటీల్లో సైతం జయకేతనం ఎగురవేస్తున్నాడు. క్రీడల్లో రాణిస్తూనే బాగా చదువుకుని ఉపాధ్యాయుడిగా స్థిరపడతానని చెబుతున్నాడు.

ఉన్నత స్థానంలో ఉండాలి



తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ముందు అతడికి అంధత్వం అడ్డురాలేదు. అడ్డంకులను అధికమిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు వెళుతున్నాడు ఏలూరుకు చెందిన పవన్. రన్నింగ్, షాట్‌పుట్‌లో పతకాలు సాధిస్తున్నాడు. లోకాన్ని చూడలేకపోయినా లక్ష్యాన్ని చేరి నేటియువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు..జీవితంలో ఉన్నతస్థానంలో ఉండాలనేది తన సంకల్పమని పవన్ పేర్కొన్నాడు.

దివ్యాంగులకు అండగా..



చుట్టూ అలుముకున్న చీకటిని చూసి నా బతుకింతే.. అనుకునేవారు నిరాశాజీవి. చిరుదీపం వెలి గించే ప్రయత్నం చేసేవారు ఆశాజీవి. కాగడా వెలిగించి తనలాంటి వారందరినీ వెలుగువైపు నడిపించే వారు ఆదర్శజీవి. అటువంటి వ్యక్తి క్రొవ్విడి ఉదయ్‌శంకర్. తనలాగా ప్రమాదాల్లో కాళ్ళు పోగొట్టు కున్నవారు వారి కాళ్లపై వారు నడిచేలా ఊతమిస్తూ సాయం అందిస్తున్నారు. గణపవరానికి చెందిన ఉదయశంకర్ చెన్నైలో రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేశారు. 1989లో ఫ్యాక్టరీలో పని చేస్తుండగా ప్రమాదానికి గురై కాలును పూర్తిగా కోల్పోయారు. కృత్రిమకాలు పెట్టుకుని 2002 వరకు అదే కంపె నీలోనే ఉద్యోగిగా కొన సాగారు. తనలాగా బాధపడుతున్నవారికి తనవంతు సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాదులో హైటెక్ టెక్నాలజీతో పరికరాలు తయారు చేసే సంస్థలో ట్రైనింగ్ తీసుకున్నారు. కృత్రిమ అవయవాల తయారీలో మెలకువలు నెర్చుకున్నారు. స్వగ్రామం గణ పవరం వచ్చి దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు తయారు చేసి అందిస్తు న్నారు. దివ్యాంగులకు వారి ఆర్థిక పరిస్థితిని బట్టి మెటీరియల్ వినియోగిస్తున్నా మన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే జైపూర్ పరికరాలు కూడా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో దివ్యాంగులకు బస్‌పాస్‌లు, రైల్వేపాస్‌లు, ఇప్పించడం, అవసరమైనవారికి ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, తదితర వాటిని అందించడం చేస్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి ఏలూరు జిల్లా దివ్యాంగ మహాసంఘటన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు.

-గణపవరం

పదోన్నతులు కల్పించాలి



దివ్యాంగులకు త్వరితగతిన పదోన్నతులు కల్పించాలి. వారు కోరుకుంటేనే బదిలీ చేయాలి. అత్యధిక శాతం వైకల్యం ఉన్న వారికి ప్రథమ ప్రాధాన్యం కల్పించాలి. ప్రభుత్వం నుంచి ప్రోత్సహకాలు తక్కువగా అందుతున్నాయి.వివాహక ప్రోత్సాహక బహుమతులు లేవు. నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి.

అల్లాడి నటరాజ్, ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యుడు,ఆకివీడు

మనుషులకే కాదు..జంతువులకూ కృత్రిమ అవయవాలు

పాలకొల్లు అర్బన్ : ఆయనకు కాళ్లు లేవు.. రైలు ప్రమాదంలో రెండుకాళ్లు పోగుట్టుకున్నారు. అయినా బుల్లెట్ నడుపుతారు. మెకానిజం కూడా చేస్తుంటారు. కారు డ్రైవ్ చేస్తారు. అవయవ లోపం కలిగిన వారు తమ అవసరాన్ని అధిగమించే విధంగా ఆలోచన చేయగలగాలని, మనలో ఉన్న లోపాలను తలచుకోకుండా ఆత్మ స్థైర్యంతో ముందుకు వెళ్లాలని చెబుతుంటారు. పాలకొల్లుకు చెందిన చైతన్య తన 25వ ఏట నవంబరు 25వ తేదీన తన పుట్టిన రోజునే పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లనూ కోల్పోయారు. సదాశివమూర్తి ఆత్మ నిబ్బరంతో నిలిచి తన స్నేహితులు డాక్టర్ చల్లా మల్లికార్జున శర్మ, డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ), దొడ్డిపట్లకు చెందిన సత్యనారాయణమూర్తి తదితరులతో పాటు తన భార్య సుందరి అందించిన సహకారంతో కృత్రిమ కాళ్లతో పని చేస్తున్నారు. కాళ్లు, చేతులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నవారికి ఆయన తన వంతుగా సాయం చేస్తున్నారు. 1999 నవంబరు 25వ తేదీన పాలకొల్లులో కృత్రిమ అవయవ కేంద్రం నెలకొల్పారు. ఇప్పటికీ 25 ఏళ్లుగా 10 వేల మందికి పైగా కాళ్లు, చేతులు అమర్చారు.. వీరిలో 5 ఏళ్ళ చిన్నారులకు ఉచితంగానే అవయవాలను అందిస్తున్నట్టు సదాశివమూర్తి తెలిపారు. మనుష్యులకే కాకుండా ఆవులకు కాళ్ళు అమర్చడం చేస్తు న్నారు. ఇటీవల కృష్ణా జిల్లా మోపిదేవిలో ఆరు నెలల ఆవుదూడకు ముందు కాలు అమర్చినట్టు తెలిపారు.అత్తిలి వద్ద పల్లెటూరులో పురోహితుని ఆవు వెనుక కాలు దెబ్బతినడంతో కాలు తయారు చేసినట్టు, ఈ కాలును మంగళవారం ఆ గ్రామం వెళ్లి అమర్చనున్నట్టు తెలిపారు.



ఆవు వెనుక కాలును సిద్ధం చేసిన సదాశివమూర్తి



పండుగకు ముందుగానే ఫుల్

సంక్రాంతికి వచ్చేందుకు రెడీ
బస్సులు, రైల్వే, టికెట్లు ఫుల్
రైళ్లలో పెరుగుతున్న వెయిటింగ్ లిస్టు
ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక

భీమవరంటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంక్రాంతి పండుగ కోసం రెండు నెలల ముందునుంచే హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సొంత ప్రాంతాలకు వచ్చేందుకు రెడీ అవుతున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి ఉభయ గోదావరి జిల్లాలకు ఆర్టీసీ అధికారులు నడిపే సర్వీసులకు ఇప్పటికే టికెట్లు రిజర్వేషన్‌లు పూర్తయ్యాయి. దీంతో ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు కసరత్తు నిర్వహిస్తున్నారు. ప్రతీ డిపోనుంచి రెండు ప్రత్యేక సర్వీసులకు రిజర్వేషన్‌లు కల్పించారు. వాటికి కూడా స్పందన బాగానే ఉందంటున్నారు. ఈసారి దాదాపు వారం రోజులపాటు సెలవులు రావడంతో సంక్రాంతిని పండగను జోష్‌గా నిర్వహించుకులా వాతావరణం కనిపిస్తోంది. ఈసారి 10వ తేదీ నుంచి 16 వతేదీ వరకు పండుగలు రావటంతో దానికి అనుగుణంగా ప్రయాణాలు ఫిక్స్ చేసుకుంటున్నారు. ఈసారి హైదరాబాద్ నుంచి భారీగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

ఆర్టీసీలో రిజర్వేషన్లు పూర్తి

ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఆర్టీసీ 44 సర్వీసులను హైదరాబాద్ నుంచి రోజువారీగా నడుపుతున్నారు. ఇందులో ఏలూరు జిల్లాకు సంబంధించి 26 సర్వీసులు, పశ్చిమ నుంచి 18 సర్వీసులు ఉన్నాయని ఆర్టీసీ ప్రజా రవాణాధికారి వర ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే ఈ సర్వీసులకు రిజర్వేషన్‌లు పూర్తి కావటంతో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని, రెండు రోజుల్లో ఏఏ డిపో నుంచి ఎన్ని సర్వీసులు హైదరాబాద్ నుంచి జిల్లాకు నడపాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి తరువాత కూడా హైదరాబాద్‌కు కూడా సర్వీసులు ఏర్పాటుపై ఆలోచన చేస్తామని తెలిపారు. ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సర్వీసులను నడపటం వల్ల ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోందంటున్నారు.

రైల్వేలో వెయిటింగ్ లిస్టు

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి పశ్చిమ మీదుగా నడిచే రైళ్ళ రిజర్వేషన్‌లు పూర్తి అయి వెయిటింగ్ లిస్టు కనిపిస్తోంది. 8వ తేదీ నుంచి ఈ పరిస్థితి ఉంది. దీనివల్ల రైల్వేశాఖ కూడా ప్రత్యేక రైళ్ళు నడుపుతుందనే దానిపై ప్రజలు ఎదురు చూస్తున్నారు.

డ్యాన్స్..డ్యాన్స్..

సినీరంగంలో గొల్లలకోడేరు కుర్రాడు



ప్రతిభ ఉంటే ఏ రంగంలోనైనా రాణించ వచ్చని పల్లెటూరు నుంచి సినీ రంగంలో నిల దొక్కుకుని చిన్న వయసులోనే సినీ డ్యాన్స్ మాస్టర్‌గా పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు..రామ్ ఇసుకపాటి. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన రామ్‌కి చిన్నతనం నుంచి డాన్స్ అంటే ఎంతో ఇష్టం. ఆ మక్కువతోనే చదువుకుంటూనే చిన్న చిన్న డాన్స్ ప్రోగ్రామ్‌లు చేస్తూ ఎన్నో మన్ననలు పొందేవాడు. భీమవరంలోని విష్ణు కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు.. 2016లో హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఈటీవీ-డి డాన్స్ ప్రోగ్రామ్‌లో డ్యాన్సర్‌గా రాణించి అక్కడే అసిస్టెంట్ డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేశాడు. అక్కడే ఉంటూ మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తూ తన ప్రతిభ చూపించాడు. తద్వారా డ్యాన్స్ యూనియన్‌లో మెంబర్‌షిప్ తీసుకుని డాన్స్ మాస్టర్‌గా ఎదిగాడు. ఈ కెరీర్‌లో రామ్ ఇసుకపాటికి ఫ్రెండ్స్, కళాశాల అధ్యాపకులు ఎంతో చేయూతనందించారు. రామ్ ఇసుకపాటి సినీ రంగంలో 2019 సినీ మాస్టర్‌గా ఎదిగారు. తనకంటూ ఒక స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇప్పటికి పది సినిమాలు రిలీజ్ అయ్యాయి. మరో ఇరవై సినిమాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. నా ప్రేమ్ కథ, విశ్వక్, నువ్వంటే పిచ్చి, సమ్మతమే, బాయ్‌ఫ్రెండ్ ఫర్ హైర్, గ్రంధాలయం, సర్కిల్, సౌండ్ పార్టీ, పారిజాత పర్వం, లగ్గం సినిమాల్లో రామ్ డ్యాన్ మాస్టర్‌గా పనిచేశాడు.

కష్టపడితే రాణించవచ్చు..



పల్లెటూరి నుంచి డాన్స్ మాస్టర్‌గా ఎదగడమంటే చాలా కష్టపడాలి. అందుకు తగ్గట్లుగానే డాన్స్ మాస్టర్ రామ్ ఇసుకపాటి సినీ డాన్సర్‌గా ఎదగడానికి ఎంతో కష్టపడ్డారు. ఓపిక, సహనం, పట్టుదల, ప్రతిభ ఉంటే ఎటువంటి రంగంలోనైనా రాణించవచ్చని రామ్ చెబుతున్నారు..

-పాలకోడేరు

షష్టి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి : ఆర్డీవో



ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవస్థానంలో ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న షష్టి కల్యాణోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. షష్టి ఉత్సవాల నిర్వహణపై సోమవారం దేవస్థానం కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించి రెవెన్యూ, మెడికల్, ఫైర్, పోలీసు, ఎక్సైజ్, విద్యుత్ పంచాయతీల అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.కె.సుభానీ, సీఐ రవికుమార్, దేవస్థానం ఏసీ గంగా శ్రీదేవి, ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు, ఈవోపీఆర్డీ అశోక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అనం తరం ఆర్డీవో దేవస్థానం వద్ద జరుగుతున్న ఏర్పా ట్లను పరిశీలించారు.

ఇల్లు కడదాం..



అందుబాటు ధరల్లో నిర్మాణ సామగ్రి

- కనిష్ఠ ధరకు సిమెంటు, ఐరన్
- ఇసుక రైట్ రైట్ చేరువలో ఇటుక

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సామగ్రి ధరలు కనిష్ఠ స్థాయికి చేరాయి. పదిహేనేళ్ల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం సిమెంట్, ఐరన్ ధరలు కూడా అదేస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. నిన్నటి వరకూ అందని ద్రాక్షగా మారిన ఇసుక ప్రస్తుతం అందరికీ అందే పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్యులు సొంత ఇంటి కల తీరే అవకాశాలు కనబడుతున్నాయి. ఇళ్ల నిర్మాణానికి అనువుగా ప్రస్తుత మార్కెట్ ధరలు అందుబాటులోకి వచ్చినట్టయింది. ఒక పక్క ఇసుక, సిమెంట్, ఐరెన్‌తోపాటు ఇటుక, మెటల్, తదితర ధరలు కూడా దిగివచ్చాయి. దీనితో రెండున్నరేళ్లగా నిర్జీవంగా ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఊపందుకున్నాయని రియల్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పదిహేనేళ్ల కనిష్ఠ స్థాయికి సిమెంటు

ఇంటి నిర్మాణానికి సిమెంట్ ప్రధానం. సిమెంట్ ధరలు ప్రస్తుతం పదిహేనేళ్ల క్రితం పలికిన ధరల స్థాయికి వచ్చాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. తాజాగా మార్కెట్‌లో సిమెంట్ ధరలు రూ.240 నుంచి 280 వరకూ వాటి గ్రేడ్స్, కంపెనీలను బట్టి ధరలు పలుకుతున్నాయి. గతంలో రూ.350 నుంచి 400 వరకూ విక్రయించేవారు. ప్రస్తుతం నిర్మాణాలు కొంత మందకొడిగా ఉండడంతో కనిష్ఠ ధరలు పలుకుతున్నాయని వ్యాపారులు భావిస్తున్నారు.

ఐరన్ టన్ను రూ.58 వేలు

గతంలో ఐరన్ టన్ను రూ.85 వేల ధర ఉండగా ప్రస్తుతం కనిష్ఠ ధరకు దిగివచ్చాయి. కంపెనీలను బట్టి బేసిక్ ఐరన్ ధర రూ.58 వేల నుంచి 65 వేలు పలుకుతోంది. ఇప్పటి వరకూ రెండేళ్లలో ఇదే కనిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు మరికొన్ని నెలలు నిలకడగా ఉంటాయని భావిస్తున్నారు.

ఇటుకలు కూడా..

సిమెంటు ఇటుకలు, మట్టి ఇటుకల వరకూ అన్నింటి ధర తక్కువగా ఉంది. గతంలో సిమెంటు ఇటుక ఒక్కోటి రూ.24 ధర కాగా ప్రస్తుతం రూ.20, రూ.8 పలికిన మట్టి ఇటుక ప్రస్తుతం రూ.6 చొప్పున అమ్ముతున్నారు. దీంతో ఇటు సిమెంటు, ఐరన్‌తోపాటు ఇటుక కూడా అందుబాటులో ఉన్నట్టే.

నిలకడగా మెటల్

అత్యంత అరుదుగా లభించే నల్ల మెటల్ ధరలు గతంతో పోలిస్తే తగ్గినా వాటి ధర నిలకడగానే అందుతోంది. ఆ మెటల్ ధరలు రూ.7వేల నుంచి 9 వేల వరకూ 3యూనిట్‌ల లారీ ధర అందిస్తున్నారు.

ఇసుక రైట్ రైట్..

నిన్నటి వరకూ ఇసుక కోసం ఎదురు చూసిన నిర్మాణదారులకు ప్రస్తుతం ఇసుక సులువుగా అందించే ఏర్పాటు చేస్తుండడంతో నిర్మాణాల్లో ఊపు పెరిగింది. ప్రస్తుతం 3 నుంచి 5 యూనిట్‌ల లారీలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం ర్యాంపుల నుంచి ఇసుక పొందే వెసులుబాటు ఇవ్వడంతో ప్రస్తుతం ఇసుక కిరాయితో కలిపి 3యూనిట్‌లు రూ.8 వేలకు, 5 యూనిట్‌లు రూ.13 వేలకు బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి.

నిర్మాణం ఊపందుకుంటుంది



నిన్నటి వరకు ఇసుక లేక నిర్మాణాలు మందకొడిగా సాగాయి. ప్రస్తుతం ఇసుక, నిర్మాణ సామగ్రి ధరలు అందుబాటులో ఉండడంతో పనులు ఊపందుకుంటాయి. ఈ ధరలు ఇలానే కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఉప్పులూరి మధు, మేస్త్రీ, తాడేపల్లిగూడెం

ఆనందంగా ఉంది..



ఇంటినిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా. ప్రస్తుతం ధరలు అందుబాటులో ఉండటంతో నేను ఇల్లు కట్టగలననే భరోసా కలిగింది. ఈ ధరలకు ఇంటినిర్మాణం చేపట్టి సొంతింటి కలను నెరవేర్చుకుంటాను.

ఎం.త్రిమూర్తులు, నిర్మాణదారు తాడేపల్లిగూడెం

టీడీపీలోకి ఆళ్ల నాని

ఒకప్పుడు వైసీపీలో కీలకంగా వ్యవహరించడమేకాదు వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా మెలిగి జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా రాణించినవారు ఇప్పుడు టీడీపీ వైపు చూస్తున్నారు. ఆ మేరకు పార్టీ పెద్దలతో సంప్రదింపులు పూర్తయ్యాయి. ఇక లాంఛనంగా పార్టీలో చేరడమే. ఈ మేరకు టీడీపీ అధినాయకత్వం కూడా దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేడు ఆయన చేరిక ఖాయం కానుంది. ఈ మేరకు జిల్లాలో ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని టీడీపీ అధిష్ఠానం వర్తమానం ఇచ్చింది. ఆళ్ల నానితోపాటు మరో ఇద్దరు మాజీలు సైకిల్ ఎక్కేందుకే సిద్ధమవుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- నేడు అధినాయకత్వం కీలక నిర్ణయం
- అదే దారిలో మరో ఇద్దరు మాజీలు
- భారీ మెజార్టీతో గెలుపొందినా మళ్లీ వారెందుకంటున్న కేడర్
- వైసీపీ మూలాలు కదిలించేందుకే ఈ నిర్ణయమంటున్న టీడీపీ నేతలు



వైసీపీ అధినేత జగన్ వైఖరిని నిరసిస్తూ వైసీపీలో ఇమడలేక రాజీనామా చేసిన నేతలు టీడీపీ వైపు చూస్తున్నారు. అలాంటి వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇప్పటికే ఏలూరు నియోజకవర్గంలో వైసీపీ అంతా ఖాళీ అయింది. టీడీపీలో చేరిపోగా ఇంతకుముందే వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని నేడు సైకిల్ ఎక్కబోతున్నారు. రెండు నెలల క్రితం వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి ఆళ్ల నాని రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన కొద్దికాలం సైలెంట్‌గా ఉన్నారు. తరువాత హైదరాబాద్, మరికొన్ని రహస్య ప్రదేశాల్లో టీడీపీ నేతలతో భేటీ అవుతూ వచ్చారు. పైకి సమాచారం పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే తెలుగుదేశంలో చేరేందుకు ఆళ్ల నాని తన శక్తియుక్తులను ఉపయోగించారు. బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన ఆయన టీడీపీలో చేరతారని కొన్నాళ్ల క్రితమే ప్రచారం సాగింది. చాలామంది ఇదే పంథా అనుసరించారు. స్థానిక టీడీపీ నాయకత్వం సైతం ఆళ్ల నాని టీడీపీలో చేరికను తోసిపుచ్చింది. తాము బలంగా ప్రజామోదంతో గత ఎన్నికల్లో 62 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందితే పార్టీకి ఆళ్ల నాని అవసరం ఏమిటన్నట్టుగా కిందిస్థాయి కేడర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ఆళ్ల నాని మీడియా, స్థానిక నేతలెవరికీ ఫోన్‌లోకి సైతం టచ్‌లోకి రాలేదు. టీడీపీలో చేరతారన్న ప్రచారాన్ని ఖరారు చేసేందుకు చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు. గడిచిన రెండు నెలలుగా టీడీపీలో ఓ ముఖ్య నేత ఆళ్ల నానికి మద్దతుగా నిలిచి ఆయనను పార్టీలోకి చేర్చుకోవడానికి దాదాపు అన్ని రూట్లను క్లియర్ చేసినట్టు భావిస్తున్నారు. పార్టీ అధినాయకత్వం కూడా ఆళ్ల నాని విషయంలో అన్ని కోణాల్లో ఆలోచించి తదుపరి ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతర్గతంగా ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వక పోయినా పార్టీలో స్వచ్ఛందంగా చేరేందుకే నాని కూడా సమ్మతించినట్టు సమాచారం.

వైసీపీ ఆవిర్భావం నుంచి..

ఆళ్ల నాని వైసీపీ ఆవిర్భావం సమయంలో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మరీ జగన్ నేతృత్వంలోని వైసీపీలో చేరారు. వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితునిగా గడిచిన రెండున్నర దశాబ్దాల నుంచి ఆయన కొనసాగుతూ వచ్చారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి కూడా కట్టబెట్టారు. అంతలా వైసీపీలో ఆయన ఓ వెలుగు వెలిగారు. ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడి గా, విభజిత ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగడమే కాకుండా ఎమ్మెల్సీగా కొన్నాళ్లు వ్యవహరించారు.

గడిచిన ఎన్నికల్లో ఏలూరు నుంచి నాలుగో సారి పోటీచేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి వైసీపీ కార్యకలాపాల్లో సైలెంట్ అయ్యారు. పార్టీ అధినాయకత్వంతో ఆయన దాదాపు విభేదించారు. దానికి గల కారణాలేవీ ఇప్పటికీ బహిర్గతం కాలేదు. ఆయన కూడా నోరువిప్పి ఎవరికీ చెప్పుకోలేదు. దీనికితోడు ఆళ్ల నానికి అత్యంత సన్నిహితంగా ఉన్న ఏలూరు మేయర్, మరి కొందరు నేతలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ లో చేరారు. ఈ నేపథ్యంలో నాని తెలుగుదేశంలో చేరుతున్నట్టు సమాచారం అందింది. నేడు ఆయన అధికారికంగా సైకిల్ ఎక్కబోతున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని టీడీపీ అధిష్ఠానం వర్తమానం పంపింది.

పెదవి విరిచిన కేడర్

ఏలూరులో ఎటువంటి అడ్డంకులు లేకుండా పార్టీ సభ్యత్వ నమోదు, పాలనా వ్యవహారాల్లో ఏకచత్రాధిపత్యంగా ఎమ్మెల్యే బడేటి చంటి, ఆయన వెంట ఉన్న కేడర్ ఉత్సాహంగా ఉన్నారు. ఆళ్ల నాని చేరిక అంటూ ప్రచారం జరిగినప్పుడే కేడరంతా దాదాపు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే చంటి మాత్రం దీనిపై ఎక్కడా నోరు మెదపకుండా సైలెంట్‌గా ఉన్నారు. ఇప్పుడు ఆళ్ల నానిని తిరిగి పార్టీలో చేర్చుకుంటే తిరిగి వ్యవహారం మారుతుందన్న వాదనే అత్యధికుల్లో ఉంది.

మరో ఇద్దరు మాజీలు కూడా..!





మాజీ మంత్రి ఆళ్ల నానితో పాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై టీడీపీ దృష్టి పెట్టినట్టు సమాచారం. విభజిత పశ్చిమగోదావరి జిల్లాలోని ఇద్దరు మాజీలు చాలా కాలం క్రితమే వైసీపీకి రాంరాం పలికేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో దూరంగానే ఉంటున్నారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టీడీపీలో చేరే అవకాశాలు లేకపోలేదని కొందరు, ఆయన వైసీపీని వీడి జనసేనలో చేరతారని ఇంకొందరు ప్రచారం ఆరంభించారు. అవునని, కాదని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎక్కడా కొట్టిపారేయలేదు. జరుగుతున్న పరిణామాలన్నింటినీ ఆయన చూస్తుండిపోయారు. ఒకానొక దశలో గ్రంధి శ్రీనివాస్ రాజకీయ ప్రస్థానంపైన దుమారమే చెలరేగింది. భీమవరంలో ఓటమి అనంతరం ఆయన వ్యక్తిగత పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవలే ఆయన కంపెనీలు, నివాస గృహంలో ఐటీ దాడులు సుదీర్ఘంగా సాగాయి. ఈ దాడుల్లో ఏం బయటపడిందనేది మాత్రం ఇప్పటిదాకా ఆదాయపు పన్ను శాఖ నిర్ధారించలేదు. ప్రకటించ లేదు. ఈ దాడుల వ్యవహారంలో గ్రంధి, ఆయన అనుచరులు పూర్తిగా సైలెంట్‌గానే వ్యవహరించారు. ఈ దాడులకు ముందే ఆయన పార్టీ మారతారంటూ విస్తృతంగా ప్రచారం సాగింది. ఇప్పుడు ఆదిశగానే టీడీపీ దృష్టి పెట్టినట్టు సమాచారం. దీనిపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. పనిలో పనిగా మరో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు వైసీపీని వీడబోతున్నట్టు చాలా కాలంగానే ప్రచారం సాగుతూ వచ్చింది. జిల్లాలో సీనియర్ అయిన రంగనాథరాజు పట్ల అందరిలో సానుకూలత ఉంది. ఈ తరుణంలో ఆయనను పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ సన్నద్ధతలోనే ఉన్నట్టు చెబుతున్నారు. అటువైపు ఆళ్ల నాని, ఇటువైపు గ్రంధి, రంగనాథరాజును పార్టీలోకి తీసుకోవడం ద్వారా వైసీపీ మూలాలను పూర్తిగా కదిలించవచ్చనే కోణంలోనే టీడీపీ నాయకత్వం ఉంది. ఆ దిశగానే సంప్రదింపులు సాగుతున్నట్టు సమాచారం. విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పుడు అన్ని స్థానాల్లోను కూటమి ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలపైన దృష్టి పెట్టడానికి అనేక కారణాలు ఉన్నట్టు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఇదంతా ఒక క్రమపద్ధతిలోనే కసరత్తు సాగుతుందని పార్టీ కూటమికి ఏదైతే కలిసొస్తుందో ఆ దిశగానే నిర్ణయాలు ఉంటాయని మరో వాదన చేస్తున్నారు. ఈ చేరికలను టీడీపీ కేడర్‌లో అత్యధికులు సానుకూలంగా తీసుకునే పరిస్థితిలేదు. గతంలో వైసీపీని ధీటుగా ఎదుర్కొని అనేక అక్రమ కేసులకు పార్టీ కేడర్ బలవ్వగా ఇప్పుడు ఆ పార్టీ నేతలనే తిరిగి పార్టీలో చేర్చుకుంటారన్న సంకేతాలతో టీడీపీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉంది.

పాలకొల్లు మున్సిపల్ మాజీ చైర్మన్
వల్లభు నారాయణమూర్తి మృతి



నారాయణమూర్తి మృతదేహం వద్ద మంత్రి నిమ్మల నివాళి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత వల్లభు నారాయణ మూర్తి (71) ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. నారాయణ మూర్తి భార్య కరోనా సమయంలో మరణించగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదివారం జరిగిన కాపు సంఘం వనభోజనాల్లో పాల్గొన్న నారాయణ మూర్తి అస్వస్థతకు గురి కావడంతో విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్టు టీడీపీ వర్గాలు తెలిపాయి. పట్టణ అధ్యక్షుడిగా, 2014 - 19 మధ్య కాలంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన నారాయణ మూర్తి వీఎస్‌ఎం ట్రాన్స్‌పోర్టును నిర్వహిస్తున్నారు. నారాయణ మూర్తి మృతి సమాచారం తెలిసి మంత్రి నిమ్మల రామానాయుడు వచ్చి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన టీడీపీకి, పట్టణ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వాహన్ పోర్టల్ ద్వారానే రవాణాశాఖ సేవలు

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు సంబంధించి అన్ని రవాణాశాఖ సేవలను ఇకపై వాహన్ పోర్టల్ ద్వారానే పొందాలని ఏలూరు జిల్లా ఉపరవాణా కమీషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఇప్పటి వరకూ ఇ-ప్రగతి పోర్టల్ ద్వారానే రవాణాశాఖ సేవలను అందించామని సోమవారం సాయంత్రం నుంచి అది నిలిపివేసి ఆ స్థానంలో వాహన్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. https://vahan.parivahan.gov.in/vahanservice/vahan/ui/state-validation/homepage.xhtml లింకు ద్వారా వాహనదారులు, వాహన డీలర్లు, వాహన ఫైనాన్సర్లు రవాణాశాఖ సేవలను పొందాలన్నారు. జిల్లాలోని రవాణా కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రాలను సంప్రదించడం ద్వారా నివృత్తితోపాటుగా సలహాలను కూడా పొందవచ్చునన్నారు. రవాణా శాఖ సేవలను పొందడంలో అనుమానాలు ఉంటే ఏలూరు జిల్లా ఆర్టీవో సెల్‌నెంబర్ 9154294210, డీటీసీ సెల్‌నెంబర్ 9154294105కు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్

నూజివీడు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు ఇద్దరికి సర్కిల్ యాప్ ఆన్‌లైన్ సర్వీసెస్‌లో ఇంటర్న్‌షిప్ లభించినట్లు ఆర్జీయుకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చివరి ఏడాది చదువుతున్న బి.సంజయ్, ఎం.భవ్యశ్రీ రూ.30 వేలు స్టైఫండ్‌తో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఇంటర్న్‌షిప్ అనంతరం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్లుగా రూ.16 లక్షల వార్షిక వేతనాన్ని వారు అందుకుంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ జి.శ్రావణి, డిప్యూటీ ఏవో ఎస్.సతీష్‌కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో సీటు పేరుతో బురిడీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనకు ఎమ్మెల్యే, మంత్రులు తెలుసని.. పిల్లలకు గురుకులంలో సీటు ఇప్పిస్తానని ఒక టీడీపీ నేత ఇద్దరి నుంచి డబ్బులు వసూలు చేసి బురిడీ కొట్టించాడు. సీటు ఇప్పించకపోవడంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగినా సదరు నేత ఇవ్వక మోసం చేశాడని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన పెనుమాక రమేష్, మండలంలోని గుళ్లపాడుకు చెందిన పెదపాటి రమేష్ తమ పిల్లలకు తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గురుకులంలో ఆరో తరగతి సీటు కోసం తెలిసిన వారి ద్వారా తిమ్మాపురానికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తపల్లి సుబ్బారావును సంప్రదించారు. తనకు మంచి పలుకుబడి ఉందని వారిని నమ్మబలికి ఒక్కొక్కరిని రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈక్రమంలో సుబ్బారావుకు ఫోన్‌పే ద్వారా పెదపాటి రమేష్ మే 17న రూ.10వేలు, ఆగస్టు29న రూ.5వేలు రెండు విడతలుగా రూ.15వేలు, పెనుమాక రమేష్ ఈ ఏడాది మే 30న రూ.10వేలు పంపారు. నెలలు గడిచినా తమ పిల్లలకు సీటు ఇప్పించలేకపోవడంతో వేరే స్కూల్‌లో చేర్పించారు. సుబ్బారావును తాము ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతను పట్టించుకోకపోవడంతో పాటు దురుసుగా మాట్లాడడంతో పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో సోమవారం ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంతి చౌదరి సర్వశిక్ష అభియాన్, స్కీమ్ నిబంధనల ఆధారంగా విద్యాసంస్థల బలోపేతానికి ఆర్థిక సహాయం చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్టాక్‌మార్కెట్ పెట్టుబడిదారులకు అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని ఎంపీ మహేష్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారని తెలిపారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణం సీజ్



దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గడువు తీరిన క్రిమిసంహారక మందులు నిల్వ ఉంచినట్లు జిల్లా విజిలెన్స్ ఎస్పీ వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏవో ఎన్ఎస్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది సోమవారం దాడి చేశారు. గొల్లగూడెంలోని శ్రీరామ ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ దుకాణంలో రూ.20,240 విలువైన గడువు ముగిసిన క్రిమి సంహారక మందులను తనిఖీ అధికారులు గుర్తించారు. గడువు ముగిసిన నిల్వలను సీజ్ చేసి షాపు యజమానిపై క్రిమిసంహారక మందుల చట్టం 1971 ప్రకారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణ నిమిత్తం కేసు నమోదు చేశారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య



యర్లగొర్ల దుర్గారావు

చాట్రాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన రైతు యర్లగొర్ల దుర్గారావు (59) అప్పుల భారంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని కుమారుడు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దుర్గారావు రెండెకరాల్లో సాగు చేస్తున్నాడు. భూమికి నీటి వసతి కోసం 3 బోర్లు వేశాడు. వ్యవసాయంలో వరుస నష్టాలతో సుమారు రూ.8 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపంతో ఆదివారం పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న దుర్గారావును విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు దుర్గారావు కుమారుడు సురేష్ తెలిపాడు. మృతుడి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

శ్రీవారి క్షేత్రంపై డ్రోన్ కెమెరా
యూట్యూబర్‌పై కేసు

ద్వారకాతిరుమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రాన్ని డ్రోన్ కెమేరాతో చిత్రీకరించి యూట్యూబ్‌లో లోడ్ చేసిన యూట్యూబర్‌పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఇటీవల యూట్యూబ్ చానల్, సోషల్ మీడియాలో చినవెంకన్న క్షేత్రాన్ని, పరిసరాలను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. దీనిపై విచారణ చేసిన ఆలయ అధికారులు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన యూట్యూబర్ వన్నెంరెడ్డి హరినాథ్ వాటిని అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. ఆలయ అధికారులు ఏఈవో పి నటరాజారావు ద్వారా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా చేయడం వల్ల ఆలయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న యువకుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన జంపన గగన్ (32)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రైవేటు ఐటీఐ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. మరో వైపు ఆయన పాస్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. వీరవల్లిలో సెమీక్రిస్టమస్ పండుగ ఉందని సోమవారం వెళ్లారు. మార్గమధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

క్రైమ్ కార్నర్

ఇంట్లో ఉండగానే.. బంగారు వస్తువుల చోరీ

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒక ఫంక్షన్‌కు వెళ్లడానికి బీరువాలోని వస్తువులను బయటకు తీసి టీవీ పక్కనపెట్టి ఇంట్లో పనులు చూస్తుండగా ఆ వస్తువులు అపహరణకు గురయ్యాయని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి రోడ్డు సుంకరవారితోటకు చెందిన కారే సుజిరాణి సోమవారం మధ్యాహ్నం ఒక ఫంక్షన్‌కు వెళ్ళే నిమిత్తం బీరువాలో బంగారు వస్తువులను బయటకు తీసి ఒక ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి టీవీ పక్కన ఉంచారు. ఆమె ఫంక్షన్‌కు సిద్ధమవుతూ వస్తువులను చూడగా కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని రూరల్ పోలీసులకు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ఏలూరులోని మహిళా కోర్టు న్యాయాధికారి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆకివీడు మండలం గుమ్ములూరు ప్రాంతానికి చెందిన గండికోట తరుణ్ భీమవరం మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తరువాత పెళ్ళికి నిరాకరించాడు. ఆమె తల్లి దండ్రుల ద్వారా పెద్దలలో పెట్టి అడిగినప్పటికీ ఒప్పుకోలేదు. భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 2022 మే 10న ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ కృష్ణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడైన తరుణ్‌ను అరెస్టు చేశాడు. ఈ కేసు ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు (మహిళా కోర్టు)లో విచారణ సాగింది. నిందితుడైన తరుణ్‌పై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధించారు. తరుణ్ తల్లి దండ్రులపై ఆరోపణ నిరూపణ కాకపోవడంతో వారిపై కేసు కొట్టి వేశారు. ప్రాసిక్యూషన్‌ను ఆ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ.రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు భీమవరం రెండవ పట్టణ పోలీసులు సహకరించారు.

ద్విచక్ర వాహనాలు చోరీ : ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగలు ఇద్దరిని లక్కవరం పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు సోమవారం మాట్లాడుతూ విలాసాలకు అలవాటు పడి పలు దొంగతనాలు చేస్తున్న భీమడోలుకు చెందిన మందపాటి జీవన్ కుమార్, బొమ్మా వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిపై తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. జీవన్‌కుమార్ 2024 ఫిబ్ర వరిలో గంజాయి అమ్ముతుండగా భీమడోలు ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి కేసునమోదు చేశారని, ఏలూరు సబ్‌జైల్లో శిక్ష అనుభవించి వచ్చినట్లు తెలిపారు. నవంబరు 28న జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన కవులూరి బాల పవన్‌కిశోర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని తెలి పారు. డిసెంబర్ 1న వాహనాలు తనిఖీ చేస్తుండగా పుట్లగట్లగూడెం సమీపం లోని నీలాలమ్మ గుడి వద్ద నిందితులను ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. లక్కవరం ఎస్సై రామకృష్ణ, సిబ్బందిని ఆయన అభినందించారు.

9 నుంచి ఏటీఎల్ హబ్ హెచ్‌ఎంలు, టీచర్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక, వృత్తి నైపుణ్యతపై ఆధునిక శిక్షణనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) హబ్‌లపై మూడురోజుల ప్రాంతీయ వర్క్‌షాపు ఈ నెల 9, 10, 11 తేదీల్లో వట్లూరులోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలులో నిర్వహించనున్నారు. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే వర్క్‌షాపులో రీజియన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు పాల్గొంటారని జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. ఎలక్ట్రానిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఐవోటీల్లో ఆధునిక సాంకేతికత, వివిధ ప్రాసెసింగ్ విధానాలపై సమగ్రశిక్ష, ఎస్సీఈఆర్టీ, యునిసెఫ్, విజ్ఞాన్ ఆశ్రమ్‌ల సహకారంతో శిక్షణనిస్తారని వివరించారు.

టీఎన్‌యూఎస్ జిల్లా కన్వీనర్‌గా రాంబాబు



మంత్రి లోకేష్‌ను కలిసిన రాంబాబు

ఏలూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యుఎస్) ఏలూరు జిల్లా కన్వీనర్‌గా నెరుసు రాంబాబును నియమించారు. ఈ మేరకు సోమవారం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ నియామక ఉత్తర్వులను రాంబాబుకు అందజేశారు. తొలుత విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలుసుకున్న అనంతరం ఉమ్మడి జిల్లా నాయకులకు జిల్లాల వారీగా అడహక్ కార్యవర్గాలను ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంఈవోలు ఆరేళ్లకుపైగా బదిలీలు లేకపోవడం వల్ల ఒకేచోట తిష్ట వేసుకున్నారని మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశామని రాంబాబు తెలిపారు. పాఠశాల విధులకు వెళ్లకుండా మండల రిసోర్స్ కేంద్రాల్లో అనధికారికంగా కొనసాగుతున్న టీచర్లను కూడా వారివారి స్కూళ్లకు పంపించేలా చర్యలు తీసుకోవాలని లోకేష్‌ను అభ్యర్థించామన్నారు. జిల్లా అడహక్ కమిటీని మంగళవారం ప్రకటిస్తామన్నారు.

లింగ వివక్షతపై అవగాహన

ఏలూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లింగవివక్షత నిర్మూలనకు జాతీయ స్థాయిలో చేపట్టిన నయీ-చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల హింసలను మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై కాంతిప్రియ తెలిపారు. ఇటువంటివి జరిగినపుడు టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నే అనసూయ వర్ధంతి సభ


సమావేశంలో మాట్లాడుతున్న శివనాగరాణి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నే భవనంలో ఐద్వా సంఘం, కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మహిళా నాయకురాలు అన్నే అనసూయ ఏడవ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నే అనసూయ చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి బృందం పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకోసం, ప్రజల కోసం అన్నేఅనసూయమ్మ చేసిన సేవలను గుర్తు చేశారు. మహిళా నాయకురాలు ఎ.శ్యామలరాణి, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, కె.దుర్గ, ఎం.హోలిమేరి, బి.రామలక్ష్మి, ఐద్వా జిల్లా నాయకురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు చెల్లించాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ వసుంధరకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ బుట్టాయగూడెం జీతాలు అందక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కృష్ణ, సత్యవతి, సుందరమ్మ, సుజాత, లక్ష్మీ, డేవిడ్ పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి


వినతిపత్రం చూపుతున్న టీడీపీ నాయకులు

ఏలూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కోమటిలంకలో కాలిబాట వంతెన నిర్మించాలని టీడీపీ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. టీడీపీ నేత ఎం.నాగరాజు మాట్లాడుతూ వర్షాలు, వరదల సమయంలో పడవ సాయంతో రోడ్డు పైకి రావాలని, కాలువ దాటే సమయంలో అనేక ప్రమాదాలు బారీన పడ్డామన్నారు. తక్షణం కాలిబాట వంతెన, తారు రోడ్డు నిర్మించాలనిని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్.రవి, జి.వీర్రాజు, సీతారామరాజు, జి.రాముడు, ఎస్.రామకృష్ణ, జి.రాఘవులు, ప్రసాద్ పాల్గొన్నారు.

సుబ్బరాజు మృతికి సంతాపం

కామవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తొలితరం కమ్యూనిస్టు పార్టీ నేత భూపతిరాజు సుబ్బరాజు వర్ధంతిని సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సుబ్బరాజు చిత్రపటానికి పూలమాల వేసి సీపీఐ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ కార్యదర్శి టీవీఎస్ రాజు కె.బుచ్చిబాబు, కె.నర్సింహులు, జి.సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.దుర్గారావు, బీవీ రాఘవులు, జి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

కామవరపుకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి సంక్రమణను ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కోసం పదేళ్లుగా

ఎదురుచూపులు




- తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లంక గ్రామ వాసుల ఆవేదన
- రాజ్యమేలుతున్న ఆటోలు, ప్రైవేట్ వాహనాలు

ఏలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ బస్సు సర్వీసు దాదాపు పదేళ్లకు పైగా దూరమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏలూరు రూరల్ మండలంలోని లంక గ్రామాలకు ప్రైవేట్ వాహనాల హవా పెరిగిపోతోంది. ఈ వాహనాల్లో గ్రామీణులు నానా అవస్థలు పడుతున్నారు. లంక గ్రామాల్లో ఐదేళ్ల క్రితం కొన్ని రోజులు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు నడిపారు. క్రమేపీ ప్రయాణికుల రద్దీ తగ్గడంతో సర్వీసు రద్దు చేశారు. ఏలూరు నుంచి భీమవరం వెళ్లే ప్రాంతాల్లో మాదేపల్లి, శ్రీపర్రు, మానూరు, కోమటిలంక, కలకుర్రు, పెదయాగనమిల్లి గ్రామాలు ఉన్నాయి. వీరికి ఏలూరు-భీమవరం, భీమవరం-ఏలూరు ఆర్టీసీ బస్సులే దిక్కు. అయితే ఈ బస్సులు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో ఈ ప్రాంతం గుండా ప్రయాణించే ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. అయితే పర్మిట్లు లేని కొన్ని వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక ఏలూరు నుంచి చాటపర్రు మీదుగా కేడీ పురం, మొండికోడు, గుడివాకలంక, పత్తికోళ్లలంక, పైడిచింతపాడు గ్రామాలున్నాయి. అయితే ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం నేటికి లేకపోవడం గమనార్హం. ఆ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ కూడా ప్రత్యామ్నాయ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాన వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. దీంతో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు రాజ్యమేలుతున్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఆర్టీసీ సర్వీసులు నడపాలని ఆయా ప్రాంతవాసులు కోరినా బస్సు సౌకర్యం కల్పించటం లేదంటూ వాపోతున్నారు.

లెక్కల మాస్టార్‌ని సస్పెండ్ చేయాలి


ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను కొట్టి కులం పేరుతో దూషించిన లెక్కల ఉపాధ్యాయుడు ముత్యాలరావును సస్పెండ్ చేయాలని విద్యార్థులకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ గతనెల 25న ద్వారకా తిరుమల మండలం ఎంపీయూపీ పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎంఎన్‌వీ ముత్యాలరావు తమ పిల్లలను ఆకారణంగా కొట్టి, కులం పేరుతో దూషించారని హెచ్‌ఎంకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మండల ఎంఈవో విచారణ జరిపి షోకాజు నోటీస్ జారీచేసి ఇన్నిరోజులు కావస్తున్నా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. తక్షణం ఆ ఉపాధ్యాయుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా ఎస్ఐగా పని చేస్తూ మరణించిన రామచంద్రరావు కుటుంబంలోని ఆయన కుమార్తె ఉషారాణికి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రాన్ని సోమవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఎస్ఐ రామచంద్రరావు జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ అనారోగ్యంతో మరణించాడు. ఆయన కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని రాయితీలను త్వరగా అందేలా అన్ని చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్ఐ రామచంద్రరావు పోలీస్ శాఖలో ఎనలేని సేవలు అందించారని ఆయన స్ఫూర్తితో కష్టపడి ఉద్యోగ నిర్వహణ చేసి పోలీస్ శాఖకు ఆమె తండ్రికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఉషారాణికి సూచించారు. త్వరితగతిన ఉద్యోగ కల్పన చేసిన జిల్లా ఎస్పీకి రామచంద్రరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బుట్టాయగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1/70 చటానికి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలపై మౌనం వహిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా చర్యలు లేకపోగా అధికారులు వితండవాదం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైన అధికారులు జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేసి, నిర్మాణాలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.నాగేశ్వరావు, కె.భాస్కర్, యు.వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న కాంచనమాల

బుట్టాయగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలను పరిష్కారించడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షురాలు వంకా కాంచనమాల తెలిపారు. సోమవారం బుట్టాయగూడెంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని గిరిజన బాల బాలికల వసతిగృహాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ బాలుర కళాశాల భవనం పూర్తిగా పాడైపోయి శిథిలావస్థకు చేరిందని అక్కడ చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నూతన భవన నిర్మాణానికి 75 లక్షల రూపాయల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు తెలపగా కూటమి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా నిధుల విడుదల కోసం కృషి చేస్తానన్నారు. నాయకులు కొండేపాటి రామకృష్ణ, సోము హరినారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు : ఎమ్మెల్యే చింతమనేని


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు ఇస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో సోమవారం పలువురు ఎమ్మెల్యేను కలిసి రేషన్ కార్డుల కోసం అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ప్రభాకర్ వైసీపీ ప్రభుత్వ సమయంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. దీంతో ఎంతోమంది పథకాలకు దూరమయ్యారని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టిందని, దీనికి సంబంధించిన విధి విధానాలను త్వరలోనే ప్రభుత్వం విడుదల చేస్తుందని ఆయన వివరించారు. ఎవ్వరూ అందోళన చెందాల్సిన పనిలేదని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు వస్తుందని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలు వేదిస్తే 112కు కాల్ చేయండి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

ఏలూరు క్రైం, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : ఇతర ప్రాంతాల నుంచి ఏలూరు నగరానికి వచ్చే మహిళలు ఆటోల్లో ప్రయాణం చేస్తూ ఉంటారని వారి భద్రత ఆటో డ్రైవర్లపై ఉందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ వి.కాంతిప్రియ అన్నారు. సోమవారం రాత్రి ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణించే మహిళలు, బాలికలను ఆకతాయిలు ఎవరైనా వేదిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వైర్లు మార్పు చేయనున్న కారణంగా గుండుగొలను నాగహనుమ ఇండస్ట్రియల్, సూరప్పగూడెం, పోలసానపల్లి, పాతూరు మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడిగా కాశీ



జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రగళ్లపాటి కాశీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫ్లాష్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం తపస్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు ది గ్రేట్ ఫుల్ హార్ట్ అనే అంశంపై ది అన్ సంగ్ హీరోస్ అనే టీమ్ పోటీలు నిర్వహించారు. 230 మంది విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలకు రూ.2 లక్షలు విలువైన బహుమతులు అందచేస్తామని బ్యాంకు మేనేజరు హరికృష్ణ, ఉదయ్‌కుమార్ తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ జి.ఆదిత్య, డైరెక్టర్ బి.సురేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ఉంగుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపురంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావు సోమవారం కలక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు, నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు గ్రంథాలయం ఎంతో అవసరమన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

రావులపర్రులో ఆరోగ్య సర్వే

ఉంగుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రావులపర్రులో సోమవారం తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సర్వే జరిగింది. సబ్ యూనిట్ అధికారితో పాటు కాగుపాడు ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, గ్రామ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

లింగపాలెం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చెయ్యాలని పార్టీ మండల అధ్యక్షుడు జి.చలపతిరావు అన్నారు. నరసన్నపాలెంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ. వందతో సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు.

నారాయణరావుకు పీఎల్‌టీయూ మద్దతు

ఏలూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావుకు మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ సమావేశం సోమవారం స్థానిక ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో జరిగింది. ప్రైవేటు, కాంట్రాక్టు, ఎయిడెడ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను ఆయన పరిష్కరిస్తారనే హామీతో నారాయణరావు అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించినట్టు వివరించారు. సంఘ నాయకులు శ్యాంప్రసాద్, ప్రేమ్ కుమార్, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీను ఏర్పాటుకై వినతి

బుట్టాయగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో వెంటనే అన్న క్యాటీన్లు ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వివిధ పనుల నిమిత్తం గిరిజనులు మండల కేంద్రాలకు వస్తుం టారని వీరు మధ్యాహ్నం భోజనం చేయాలంటే హోటల్స్‌లో రూ.150 వరకు ఖర్చు పెట్టడం కష్టంగా ఉంటుందని భావించి సీఎం చేసిన మంచి ప్రకటనను వెంటనే అమలు చేయాలని కోరారు.

న్యూరోసర్జన్ నియామకానికి

కలెక్టర్ అనుమతి

ఏలూరు క్రైం, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఐదుగురు వైద్యులను తిరిగి వైద్య విధాన పరిషత్‌కు పంపించి వేయడంతో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులకు పడుతున్నారని సీపీఐ ఏలూరు నగర కార్యదర్శి హేమశంకర్, అసిస్టెంట్ సెక్రటరీ కె.కృష్ణమాచార్యులు కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం వినతి పత్రం అందించారు. కలెక్టర్ వెంటనే స్పందించి న్యూరో సర్జన్‌ను తిరిగి నియమిస్తామన్నారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. దీంతో కలెక్టర్ వెట్రిసెల్వికి కార్యదర్శి హేమ శంకర్, అసిస్టెంట్ కార్యదర్శి కృష్ణమాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అవగాహన

ద్వారకాతిరుమల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ గురుకులం విద్యార్థులకు సచి వాలయం-2లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై సోమ వారం అవగాహన కల్పించారు. ఈ టెక్నాలజీ ఎంత ఉపయోగకరమైనదో అంత ప్రమాదమని మహి ళా పోలీసు లక్ష్మీసుజన చెప్పారు. సాధ్యమైనంత వరకూ వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో షేర్ చేయొద్దని చెప్పారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం : చంటి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చంటి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని 48వ డివిజన్ శివాలయంలో ఎమ్మెల్యే చంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాగంటి బాబుకు పరామర్శ

టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు బాబు ఎమ్మెల్యే బడేటి చంటిని పరామర్శించారు. ఇటీవల బాబుకు శస్త్ర చికిత్స జరిగింది. ఎమ్మెల్యే చంటి మాగంటి బాబు ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఈడా మాజీ చైర్మన్ బి.శ్రీనివాస్, జీహెచ్.సత్య వరప్రసాద్, బి.కిషోర్, బి.శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎన్.స్వాతి కిషోర్, వి.భవాని శ్రీనివాస్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాస పరిహారం చెల్లించాలి

కుక్కునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు పునరావాస పరిహారం వెంటనే అందించాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మారేడుబాకలో సోమవారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం వేసిందన్నారు. అలాగే పోడు భూముల సాగుదారులకు పట్టాలివ్వకుండా కాలయాపన చేస్తుందని విమ ర్శించారు. జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే.గౌస్, సిరికొండ రామారావు, సత్యనారాయణ, అజాద్, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా సంఘాల జిల్లా కార్యవర్గాలను సభలో ఎన్నుకున్నారు.

ఇసుక తరలింపుపై ఫిర్యాదులు

నిడమర్రు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బావాయిపాలెంలో ఇసుక తరలింపుపై వివాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బావాయిపాలెం వాటర్ ట్యాంకులో మంచినీరు శుద్ధి చేయడానకి పంచాయతీ వర్క్ కాంట్రాక్టర్ మూడు లారీల ఇసుక తెచ్చి వాటర్ ట్యాంకులో ఇసుక మార్పిడి చేశారు. సుమారు రెండున్నర లారీల ఇసుక వాడగా రెండు ట్రాక్టర్ల ఇసుక మిగిలింది. ఈ ఇసుకను సోమవారం సర్పంచ్ వర్గీయులు తరలించు పోవడం చూసిన మరోక వర్గీయులు, స్థానికులు 50 మందితో కలసి ట్రాక్టర్‌ను అడుకున్నారు. అనంతరం స్థానికులు బి.అబ్బులు, జి.సత్యనారాయణ, జి.అభినవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సర్పంచ్ ముత్యాల పద్మావతిని వివరణ కోరగా వాటర్ ట్యాంకులో ఇసుక మార్చగా, మిగిలిన ఇసుక మాత్రమే తరలించామన్నారు. పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా ఇసుక నింపామన్నారు. తమ పనులకు ఆటకం కలిగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో

పోలిస్వర్గం నోములు



ఏలూరు, చింతలపూడిలో అరటి డొప్పల్లో దీపాలు వదిలిన మహిళలు

ఏలూరు కార్పొరేషన్/ భీమడోలు/ టి.నరసాపురం/ నిడమర్రు/కుక్కునూరు /పెదవేగి/టి.నరసాపురం /చింతలపూడి/ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళలు నివాసాల ఆవరణలోని తులసికోటల వద్ద పోలిస్వర్గం నోములను నిర్వహించి అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి నీళ్ల తొట్టెల్లో వదిలారు. దీప దానాలు, స్వయం పాకలు బ్రాహ్మణులకు సమర్పించారు. పోలిస్వర్గం పూజలతో కార్తీకమాసం ముగిసినట్టు మార్గశిర మాసంలోకి ప్రవేశించినట్టు పండితులు పేర్కొన్నారు. భీమడోలులో వేంచేసిన పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయం, గుండుగొలనులో వేంచేసిన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టి.నరసాపురం మండలంలో పాడ్యమి ఒక్కరోజున వెలిగించి దీపారాధన చేసినవో నెల రోజులు పుణ్యం ప్రాప్తిస్తుందనే నమ్మకంతో మహిళలు దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. నిడమర్రు మండలం మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రం భక్తులతో కిటకిట లాడింది. గంగాహారతిని సుమారు 3 వేల మంది భక్తులు తిలకించి, దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కుక్కునూరులోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో శివపార్వ తులకు అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిం చారు. సాయంత్రం శివపార్వతులనుగ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. పెదవేగిలోని పార్వతీ పర మేశ్వర స్వామి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. టినరసాపురం అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ, మక్కినవారి గూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయంలోనూ, మల్లుకుంట శివాలయం లోనూ పోలి పాడ్యమి ఘనంగా నిర్వహించారు. చింతలపూడి పట్టణంలోని మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మట్టిని తవ్వి కొలను తయారు చేసి అందులో ప్లాస్టిక్ పరదా కప్పి నీటిని నింపారు. ఈ నీటిలో అరటి డొప్పలను వెలిగించి పూలతో భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు జరిపారు.

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రూరల్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సీహెచ్‌డీ ప్రసాద్, సిబ్బందితో సోమవారం కొమడవోలు శివారు ఇందిరమ్మ కాలనీకి కొంత దూరంలో వరి చేలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కల్గి ఉన్నాడు. మృతుడు నాలుగు రోజుల క్రితం మర ణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్ఐ సెల్ నెంబర్ 94407 96636కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ద్వారకాతిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జి.కొత్తపల్లిలో వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.సుధీర్ తెలిపారు. గ్రామానికి చెందిన రేపూరి వెంకటేశు(45) మద్యానికి బానిసవ్వడంతో అతడి భార్య కుమార్తెతో ఏడాదిన్నర క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం తెల్లవారుజామున వెంకటేశు మంచం పై నుంచి కింద పడి ఉన్నాడు. పరిశీలించగా చని పోయిన్నట్లు గుర్తించి పోలీసులకు అతని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒక వ్యక్తిని ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు. అశ్వారావుపేట రోడ్డులోని వేగవరం సమీపంలో రిలయన్స్ పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న పొలం యజమాని వద్ద పని చేస్తున్న కొల్లి వెంకినాయుడు సోమవారం తెల్లవారు జామున బహిర్భూమికి బైపాస్ రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తుపాకుల మోహనకృష్ణ ద్విచక్ర వాహనం అతి వేగంగా నడుపుకుంటూ వెంకినాయుడును వెనుక నుంఞ బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వెంకి నాయుడుకు తీవ్ర గాయాలు కావడంతో జంగారెడ్డి గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఒకని అరెస్ట్

చింతలపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్‌లో పోతునూరులో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి బండారి సునీత అనే మహిళ నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రగడవరంలో బెల్టు షాపు నిర్వాహకుడు పర్సా రాంబాబు పాత కేసులో ఉన్న బాలిన ఏడుకొండలును మండల తహసీల్దార్ వద్ద హాజరుపరిచి బైండోవర్ నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వలసపల్లి అడ్డరోడ్డు వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఎస్ఐ కె.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య


యర్లగొర్ల దుర్గారావు

చాట్రాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన రైతు యర్లగొర్ల దుర్గారావు (59) అప్పుల భారంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని కుమారుడు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు దుర్గారావు రెండెకరాల్లో సాగు చేస్తున్నాడు. భూమికి నీటి వసతి కోసం 3 బోర్లు వేశాడు. వ్యవసాయంలో వరుస నష్టాలతో సుమారు రూ.8 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపంతో ఆదివారం పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న దుర్గారావును విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు దుర్గారావు కుమారుడు సురేష్ తెలిపాడు. మృతుడి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

నూజివీడు, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): మీకోసంలో దాఖలైన అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నూజివీడు ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల పరిధిలో 14 అర్జీలు దాఖలైనట్లు ఆమె తెలిపారు. అధికారులు అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

నేడు ప్రజా వేదిక

నూజివీడు, చాట్రాయి, ముసునూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో నూజివీడు పట్టణంలోని సచివాలయాలు, ముసునూరు, చాట్రాయి, నూజివీడు ఎంపీడీవో కార్యాలయాలు, ఆగిరిపల్లి పొన్నం కల్యాణ మండపాల్లో ప్రజా వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

పేకాటపై పోలీసుల దాడి

చాట్రాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్వతాపురంలో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకొని రూ 26,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

● ఆగిరిపల్లి: మండలంలో గౌడ బజారులో పేకాడుతున్న ఏడుగురిని, ఎస్‌ఏ పేటలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

టీడీపీలోకి ఆళ్ల నాని

ఒకప్పుడు వైసీపీలో కీలకంగా వ్యవహరించడమేకాదు వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా మెలిగి జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా రాణించినవారు ఇప్పుడు టీడీపీ వైపు చూస్తున్నారు. ఆ మేరకు పార్టీ పెద్దలతో సంప్రదింపులు పూర్తయ్యాయి. ఇక లాంఛనంగా పార్టీలో చేరడమే. ఈ మేరకు టీడీపీ అధినాయకత్వం కూడా దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేడు ఆయన చేరిక ఖాయం కానుంది. ఈ మేరకు జిల్లాలో ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని టీడీపీ అధిష్ఠానం వర్తమానం ఇచ్చింది. ఆళ్ల నానితోపాటు మరో ఇద్దరు మాజీలు సైకిల్ ఎక్కేందుకే సిద్ధమవుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- నేడు అధినాయకత్వం కీలక నిర్ణయం
- భారీ మెజార్టీతో గెలుపొందినా మళ్లీ వారెందుకంటున్న కేడర్
- వైసీపీ మూలాలు కదిలించేందుకే ఈ నిర్ణయమంటున్న టీడీపీ నేతలు



వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని నేడు సైకిల్ ఎక్కబోతున్నారు. రెండు నెలల క్రితం వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి ఆళ్ల నాని రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన కొద్దికాలం సైలెంట్‌గా ఉన్నారు. తరువాత హైదరాబాద్, మరికొన్ని రహస్య ప్రదేశాల్లో టీడీపీ నేతలతో భేటీ అవుతూ వచ్చారు. పైకి సమాచారం పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే తెలుగుదేశంలో చేరేందుకు ఆళ్ల నాని తన శక్తియుక్తులను ఉపయోగించారు. బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన ఆయన టీడీపీలో చేరతారని కొన్నాళ్ల క్రితమే ప్రచారం సాగింది. చాలామంది ఇదే పంథా అనుసరించారు. స్థానిక టీడీపీ నాయకత్వం సైతం ఆళ్ల నాని టీడీపీలో చేరికను తోసిపుచ్చింది. తాము బలంగా ప్రజామోదంతో గత ఎన్నికల్లో 62 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందితే పార్టీకి ఆళ్ల నాని అవసరం ఏమిటన్నట్టు కిందిస్థాయి కేడర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ఆళ్ల నాని మీడియా, స్థానిక నేతలెవరికీ ఫోన్‌లోకి సైతం టచ్ లోకి రాలేదు. గడిచిన రెండు నెలలుగా టీడీపీలో ఓ ముఖ్య నేత ఆళ్ల నానికి మద్దతుగా నిలిచి ఆయనను పార్టీలోకి చేర్చుకోవడానికి రూట్ క్లియర్ చేసినట్టు భావిస్తున్నారు. పార్టీ అధినాయకత్వం కూడా ఆళ్ల నాని విషయంలో అన్ని కోణాల్లో ఆలోచించి ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతర్గతంగా ఎలాంటి హామీ ఇవ్వకపోయినా పార్టీలో స్వచ్ఛందంగా చేరేందుకే నాని సమ్మతించినట్టు సమాచారం.

ఆళ్ల నాని వైసీపీ ఆవిర్భావం సమయంలో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మరీ జగన్ నేతృత్వంలోని వైసీపీలో చేరారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి కూడా కట్టబెట్టారు. అంతలా వైసీపీలో ఆయన ఓ వెలుగు వెలిగారు. ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడి గా, విభజిత ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగడమే కాకుండా ఎమ్మెల్సీగా కొన్నాళ్లు వ్యవహరించారు. గడిచిన ఎన్నికల్లో ఏలూరు నుంచి నాలుగో సారి పోటీచేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి వైసీపీ కార్యకలాపాల్లో సైలెంట్ అయ్యారు. పార్టీ అధినాయకత్వంతో ఆయన దాదాపు విభేదించారు. దానికి కారణాలేవీ ఇప్పటికీ బహిర్గతం కాలేదు. ఆయన కూడా నోరువిప్పి ఎవరికీ చెప్పలేదు. దీనికితోడు ఆళ్ల నానికి అత్యంత సన్నిహితంగా ఉన్న ఏలూరు మేయర్, మరి కొం దరు నేతలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో నాని తెలుగుదేశంలో చేరుతున్నట్టు సమాచారం అందింది. నేడు ఆయన అధికారికంగా సైకిల్ ఎక్కబోతున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని టీడీపీ అధిష్ఠానం వర్తమానం పంపింది.పెదవి విరిచిన కేడర్

ఏలూరులో ఎటువంటి అడ్డంకులు లేకుండా పార్టీ సభ్యత్వ నమోదు, పాలనా వ్యవహారాల్లో ఏకచత్రాధిపత్యంగా ఎమ్మెల్యే బడేటి చంటి, ఆయన వెంట ఉన్న కేడర్ ఉత్సాహంగా ఉన్నారు. ఆళ్ల నాని చేరిక అంటూ ప్రచారం జరిగినప్పుడే కేడరంతా దాదాపు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే చంటి మాత్రం దీనిపై ఎక్కడా నోరు మెదపకుండా సైలెంట్‌గా ఉన్నారు. ఇప్పుడు ఆళ్ల నానిని తిరిగి పార్టీలో చేర్చుకుంటే తిరిగి వ్యవహారం మారుతుందన్న వాదనే అత్యధికుల్లో ఉంది.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ముసునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి నగరుల కాలనీవాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. మంచినీటి బోరు విద్యుత్ మోటారు మరమతుకు గురై నాలుగు రోజులు కావడంతో నీటి సరఫరా లేక వ్యవసాయ బోర్లు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. చుక్కనీరు లేక అల్లాడుతన్నా పంచాయితీ పాలకులు, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటారును మరమతు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కనీసం ట్యాంకర్లతో కూడా నీటి సరఫరా చేయడం లేదని వారు మండిపడ్డారు. జిల్లా పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కాలనీవాసులు కోరుతున్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ముసునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వివిధ పంటలను సాగుచేస్తున్న రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో ఎస్.మధుమోహన్ అన్నారు. ముసునూరు, గుడిపాడు, యల్లాపురం తదితర గ్రామాల్లో వరి పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. వరి, మొక్కజొన్న, మినుము, పెసర రైతులు పంటల బీమా ప్రీమియం కట్టాలన్నారు. పంటలకు నష్టం వాటిల్లినప్పుడు 80శాతం వరకు బీమా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలో ఎక్కువ విస్తీరణంలో మొక్కజొన్న పంట సాగవుతుందని రైతులందరు ఎకరానికి రూ 483 ప్రీమయం చెల్లించాలన్నారు.

దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు

ముసునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణక్కపేట మెయిన్ స్కూల్ ఉన్న భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతుల బాలబాలికలకు సోమవారం ఆటలపోటీలను నిర్వహించారు. ఐఈఆర్పీ డీవీఎంవీ.లక్ష్మీనారయణరావు పర్యవేక్షణలో క్యారమ్స్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముసునూరులో ర్యాలీ నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఐఈఆర్పీ జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి : ఆర్డీవో


సింగరాయపాలెంలో షష్ఠి ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవస్థానంలో ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న షష్ఠి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. షష్ఠి ఉత్సవాల నిర్వహణపై సోమవారం దేవస్థానం కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించి రెవెన్యూ, మెడికల్, ఫైర్, పోలీసు, ఎక్సైజ్, విద్యుత్ పంచాయతీల అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.కె.సుభానీ, సీఐ రవికుమార్, దేవస్థానం ఏసీ గంగా శ్రీదేవి, ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు, ఈవోపీఆర్డీ అశోక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో దేవస్థానం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

కోళ్ల వ్యర్థాలను అరికట్టండి

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చేపల పెంపకానికి నిషేధిత కోళ్ల వ్యర్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.కె.సుభానీకి ఆయన వినతి పత్రం అందజేశారు. పేరూరులో 12 ఎకరాల చెరువులో కోళ్ల వ్యర్థాలను మేతగా వినియోగించి చేపల పెంపకం జరుగుతోందని, దీనివల్ల పర్యావరణ కాలుష్యం ఏర్ప డుతుందని ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఆందోళన మేరకు ఇటీవల చెరువు నుంచి కోళ్ల వ్యర్థాలను అధికారులు తొలగించారే తప్ప, ఆ వ్యర్థాలను తిన్న చేపలను తొలగించలేదని ఫణీంద్ర ఫిర్యాదు చేశారు.

మట్టగుంటలో స్వచ్ఛభారత్

కలిదిండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మట్టగుంటలో సర్పంచ్ అండ్రాజు రత్నమణి, టీడీపీ నాయకుడు అండ్రాజు దుర్గారావు ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారం

కైకలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాలలోనే విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పూర్వపు విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థులు తమవంతు సహాయంగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

పోలి స్వర్గ దీపారాధనలు

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం వేకువజామున దీపారాధనలు నిర్వహించారు. పంట కాల్వల వద్ద కార్తీక లక్ష్మికి పూజలు చేసి పోలి దీపారాధనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఎమ్మెల్యే కామినేని పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు


కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు నిర్వహిస్తున్న దృశ్యం

కైకలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలకు అభిమానులు పెద్దఎత్తున ఏర్పాట్లను చేస్తున్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా వద్ద మంగళవారం ఉదయం 8 గంటల నుంచి పుట్టినరోజు వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలను, పర్యావరణహితం చేసే మొక్కలను తీసుకురావాలని పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరం అభినందనీయం : ఎమ్మెల్యే


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కలిదిండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడానికి చారిటబుల్ ట్రస్టులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఎస్.ఆర్పీ.అగ్రహారంలో సోమవారం హోప్ చారిటబుల్ ట్రస్ట్, జనసేన నాయకుడు నల్లగోపుల చలిపతిరావు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కామినేని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, జనసేన జాయింట్ సెక్రటరీ బి.కనకదుర్గ, మాజీ జడ్పీటీసీ రమాదేవి, అగ్నికుల, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు అండ్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

కిశోర్ బాలికల వికాసంపై శిక్షణ

కలిదిండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కిశోర బాలికల వికాసంపై ఏఎస్‌ఎంలు, అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహిం చారు. హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ కిశోర్ బాలికలకు రక్తహీనత, పౌష్టికాహారం, యవ్వన దశలో శరీరంలో వచ్చే మార్పులు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎంపీడీవో కొండలరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దని తల్లి మందలింపు.. కుమారుడి ఆత్మహత్య



కైకలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కైకలూరులో మార్కెట్ సమీపాన కూలిపనులు చేసుకుంటూ నాదెళ్ల వెంకటేష్ (28) తల్లితో కలిసి జీవిస్తున్నాడు. సోమవారం మద్యం సేవించడంతో తల్లి నాగమణి కొడుకుని మందలించింది. దీంతో మనస్తాపానికై గురై ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కైక లూరు టౌన్ ఏఎస్ఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.